ప్రజాశక్తి

మంగళవారం 10 అక్టోబర్ 2023 8 పేజీలు





ప్రకాశం బాపట్ల



అర్జీదారుల సమస్యలు వింటున్న కలెక్టర్ రంజిత్‌బాషా

స్పందన అర్జీల పరిష్కారానికి చర్యలు

కలెక్టర్ రంజిత్‌బాషా

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లాలో స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలు వెంటనే పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మండలాల్లో జరిగే జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. స్పందన కార్యక్రమంలో రీ ఓపెన్ అర్జీలపై ప్రత్యేక దష్టి పెట్టాలన్నారు. రీ ఓపెన్ స్పందన అర్జీల విచారణ జరిపి పరిష్కరించాలన్నారు. పంచాయతీరాజ్, రెవెన్యూ శాఖల్లో రీ ఓపెన్ అర్జీలు ఉన్నాయని వెంటనే పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సిహెచ్ శ్రీధర్, సి.పి.ఓ భరత్‌కుమార్, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి మదన్‌మోహన్‌శెట్టి, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ శంకర్ నాయక్, గహనిర్మాణశాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రసాద్, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ అర్జున్, జిల్లా రవాణా శాఖ అధికారి ఏ.చంద్రశేఖర్‌రెడ్డి, మత్స్య శాఖ జెడి సురేష్, పౌర సరఫరాల శాఖ డి.ఎస్.ఓ విలియమ్స్, డిఎం శ్రీలక్ష్మీ, బాపట్ల మున్సిపల్ కమిషనర్ ఏ.భానుప్రతాప్ పాల్గొన్నారు.

ప్రాజెక్టులను పట్టించుకోని ప్రభుత్వం

- గుండ్లకమ్మ ప్రాజెక్టు మరమ్మతులు వేగవంతం చేయాలి
- లేకపోతే ఉద్యమం తప్పదు
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

పేజీ ▲

ఎన్నికలపై సిఎం దిశానిర్దేశం

- మార్చిలో ఎన్నికలుంటాయని ప్రకటన
- అప్పటివరకూ జనంలోనే ఉండాలని నేతలకు హితవు
- రాజధానిలో వైసిపి ప్రజాప్రతినిధుల సదస్సు ఎజెండా ఇదే..




ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

మార్చిలో ఎన్నికలుంటాయని సిఎం జగన్ ప్రకటించారు. సోమవారం నాడు రాజధానిలో జరిగిన వైసిపి ప్రతినిధుల సదస్సుకు జిల్లా నుంచి ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జిలు, నియోజకవర్గాల నుంచి ముఖ్య క్యాడర్ తరలివెళ్లింది. మంత్రి ఆదిమూలపు సురేష్‌తో పాటు సీనియర్ నేత బాలినేని శ్రీనివాసరెడ్డి, పార్టీ అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డితో పాటు కీలక నేతలందరూ హాజరయ్యారు. ఎన్నికల వరకూ క్షణం తీరిక లేకుండా జనంలోనే ఉండేలా కార్యక్రమాల షెడ్యూల్‌ను ఖరారు చేశారు. బస్సు యాత్రలు, వాటి ఉద్దేశాలు, నిత్యం మూడు చోట్ల సభలు.. బస్సు యాత్రల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నేతలుంటారని చెప్పడం ప్రత్యేకత సంతరించుకుంది.

ఓట్ల కోసం ప్రధానంగా ఇతర సామాజిక వర్గాలపైనే కేంద్రీకరించారు. సంక్షేమ పథకాలు ఎవరికి ఎక్కువగా చేరువయ్యాయో ఆయా వర్గాల్లోనే తిరిగి పార్టీ లబ్ధి పొందాలనే ఉద్దేశం ఎజండాలో కీలకంగా కనిపిస్తోంది. అన్ని రకాల అభివృద్ధి కార్యక్రమాలను వదిలేశారు. కేవలం సంక్షేమ ఎజెండానే అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని విమర్శలు వచ్చినా వాటికే ప్రాధాన్యత ఇచ్చింది. కేవలం ఓట్లు కోసమే.. ఓటు బ్యాంకు కోసమే అన్నట్లుగా కార్యాచరణ కనిపిస్తోంది. 'వై నాట్ 175'అనే నినాదం కూడా వ్యూహాత్మకంగానే కనిపిస్తోంది. క్యాడర్‌లో ఉత్తేజం నింపేందుకు, వారిని నిరంతరం కార్యక్రమాల్లో ఉంచేందుకు 'వై ఎపీ నీడ్స్ జగన్' అనే నినాదంతో మూడు ప్రాంతాల నుంచి బస్సుయాత్రలను ప్రారంభించాలని నిర్ణయించారు. బస్సుయాత్రలు ముగిశాక జనవరిలో పెద్ద ఎత్తున సంక్షేమ పథకాల ఆఖరు ఘట్టం పంపిణీలు పెట్టారు. వృద్ధులకు పెన్షన్ రూ.3 వేలు అవుతుంది. ఇక ఎన్నికల సమాయత్తంలో భాగంగా ఇప్పుడున్న పార్టీతో పాటు కొత్తగా తెరపైకి తెచ్చిన పాలనా వ్యవస్థను యావత్తును వినియోగించుకోవాలనే వ్యూహంతో పాటు కార్యాచరణ కూడా ప్రకటించారు. సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్లు, సర్పంచులు, ఎంపిటీసీలు, గృహసారథులు ఇలా అన్ని విభాగాలను, వ్యవస్థలను కలుపుకొని పార్టీ నేతలు, కార్యకర్తలు ఎన్నికలకు సిద్ధమవ్వాలని సిఎం ఆదేశించారు. రెండు నెలల పాటు ప్రచార కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నారు. ఎమ్మెల్యేల నేతృత్వంలో కార్యక్రమాలు జరిగేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఎవరికీ క్షణం తీరిక లేకుండా నియోజకవర్గాల్లో కార్యక్రమాలు పెట్టారు. వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అన్ని వైపుల నుంచి సమాయత్తం కనిపిస్తోంది. చంద్రబాబు అరెస్టు వ్యవహారం పైనా సిఎం జగన్ స్పందించారు. ఆయన్ను రాజకీయకక్షతో అరెస్టు చేయలేదని చెప్పారు. ఎన్నికలు మార్చిలో ఉంటాయని, అప్పటి వరకూ జనంలోనే ఉండాలని నేతలకు దిశానిర్దేశం చేశారు. ఇప్పటివరకూ గడపగడపలో తిరుగుతూనే ఉన్నారు. అయితే ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులపై స్పష్టత రాలేదు. ఇదే ఇప్పుడు నేతల్లో దిగాలుగా ఉంది. ఎవరికి టిక్కెట్టు వస్తుందో? ఎవరికిరాదో ఇప్పటికీ స్పష్టత లేదు. ఎన్నికలకు సమాయత్తం మాత్రం జరుగుతోంది. గతంలో ఒక్క సారి అవకాశం ఇవ్వండనే నినాదంతో ఎన్నికల్లోకి ▶ 3లో

మా భూమిని ఆక్రమించారు.!

- ప్రభుత్వ భూమి అంటూ తమను అధికారులు వెళ్లనివ్వడం లేదు..
- ఇతరులు వెళితే మాత్రం పట్టించుకోవడం లేదు..
- సబ్‌కలెక్టర్‌ను ఆశ్రయించిన బాధితురాలు.!



రెవెన్యూ రికార్డుల్లో ఉన్న చిన్నస్వామి వివరాలు..

ప్రజాశక్తి-మార్కాపురం

కొద్దిపాటి విస్తీర్ణంలో ఉన్న భూమికి వారసురాలే అయినా... ఆమెను ఆ భూమిలో సాగుబడికి దిగితే చర్యలు తీసుకుంటామని రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. అది ప్రభుత్వ భూమే అయినా.. ఎప్పటినుంచో వారు అక్కడ సాగులో ఉన్నారు. ప్రభుత్వ రికార్డుల్లోనూ పేరు నమోదై ఉంది. ఆ పొలంలోనే చిన్నపాటి ఇంటిని నిర్మించుకుని నివాసం ఉన్నారు. రెవెన్యూ అధికారుల హెచ్చరిక బోర్డుతో ఆ భూమికి వారసురాలే అయినా... చట్టాన్ని ఉల్లంఘించరాదని సాగులోకి దిగలేదు. అయితే ఇదే భూమిని ఇద్దరు వ్యక్తులు ఆక్రమించారు. హెచ్చరిక బోర్డును సైతం లెక్క చేయలేదు. ఏకంగా సాగు చేసుకుంటూ.. ఆ భూమి తమదేనని అంటున్నారు. రెవెన్యూ అధికారులు మాత్రం వారికి వత్తాసు పలుకుతున్నారు. దీంతో ఆ భూమికి వారసురాలైన సిహెచ్.పెద్దక్క న్యాయం చేయాలని సోమవారం స్పందనలో మార్కాపురం సబ్ కలెక్టర్ సేతు మాధవన్‌ను ఆశ్రయించింది.



పెద్దక్క

మార్కాపురం రెవెన్యూ డివిజన్‌లోని పుల్లలచెరువు మండలం సి.కొత్తపల్లి గ్రామంలోని సర్వే నెంబరు 759/2లో 3.14 ఎకరాలు సాగు భూమి ఉంది. ఆ భూమిలో అదే గ్రామానికి చెందిన లింగం చిన్నస్వామి సాగులో ఉన్నాడు. ఆయన అదే భూమిలో నివాసం ఏర్పాటు చేసుకుని జీవనం సాగించాడు. చిన్నస్వామికి రెండు కళ్లు కనపడవు. పూర్తిగా అంధుడు. ఆయన చనిపోయాడు. ఆయన కుమార్తె సిహెచ్ పెద్దక్క వారసురాలిగా ఉంది. తండ్రి చిన్నస్వామి నుంచి సంక్రమించిన భూమిలో సాగులోకి దిగాలని పెద్దక్క ప్రయత్నించింది. స్థానికంగా రాజకీయ విబేధాల కారణంగా అక్కడి రెవెన్యూ అధికారులు పెద్దక్కకు న్యాయం చేసేలా కనిపించలేదు. పైగా ఆ భూమిలో ఎవరు దిగినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. పెద్దక్క న్యాయం కోసం అధికారుల చుట్టూ తిరుగుతోంది. ఇంతలో అదే గ్రామానికి చెందిన దారా పెద్ద రాములు, చిన్న రాములు అనే వ్యక్తులు సాగులోకి ▶ 3లో



అధిక జన ఆకాంక్ష సదస్సు సందర్భంగా ర్యాలీ, మాట్లాడుతున్న విజయ్‌కుమార్

పేదలందరూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

- భూముల పంపిణీ జరగాలి
- అధిక జన ఆకాంక్ష సదస్సులో పూర్వపు కలెక్టర్ విజయకుమార్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

పేద ప్రజలందరూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలని, ఇందుకు ప్రభుత్వాలు సహకరించాలని ప్రకాశం జిల్లా పూర్వపు కలెక్టర్, విశ్రాంత ఐఎఎస్ అధికారి జిఎస్‌ఆర్‌కెఆర్ విజయ కుమార్ పేర్కొన్నారు. ఐక్యతా విజయ పథం యాత్ర సోమవారం ఒంగోలు చేరుకుంది. స్థానిక అద్దంకి బస్టాండ్ సెంటర్ వద్ద యాత్ర బృందానికి దళిత, ప్రజా సంఘాలు, ఉద్యోగ సంఘాల నేతలు ఘన స్వాగతం పలికారు. యాత్ర బృందంపై పూల వర్షం కురిపించారు. కోలాట బృందాలు, డప్పు వాయిద్యాల నడుమ ఐక్యతా విజయ పథం యాత్ర అద్దంకి బస్టాండ్ నుంచి ఒంగోలు కలెక్టరేట్ వరకు సాగింది. కలెక్టరేట్ వద్ద జరిగిన అధిక జన ఆకాంక్ష సదస్సులో జిఎస్‌ఆర్‌కెఆర్ విజయకుమార్ మాట్లాడుతూ తాను ఐక్యతా విజయ పథం యాత్ర చేపట్టినప్పుడు యాత్ర చేయగలరా? అని పలువురు ప్రశ్నించారని తెలిపారు. ఏ పదవి లేకుండా ఎలా యాత్ర చేస్తారని పలువురు అడిగారన్నారు. ఐక్యతా విజయపథం ▶ 3లో

శివాజీ గణేష్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి బాపట్ల

ఇరవై వసంతాలుగా గ్రంథాలయ అధికారిగా పుస్తక పఠనా భిలాషులకు విశిష్ట సేవలు అందిస్తూ జిల్లా కలెక్టర్ ద్వారా ఉత్తమ అవార్డు అందుకున్న అంగల కుదురు శివాజీ గణేషన్ సేవలు అభినందనీయమని బాపట్ల ఎంపిడిఒ రాధాకష్ణ కొనియాడారు. శివాజీ గణేషన్‌కు గ్రంథాలయ పాఠకులు, పుర ప్రముఖులు సోమవారం అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ గణేషన్ సేవలను కొనియాడారు. అనంతరం ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి పిసి.సాయిబాబు , గ్రంథాలయ పాఠకులు శివాజీ గణేష్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో రచయిత ఎ.మల్లికార్జునరావు, చిత్రకారుడు జివి, ఎం నరసింహారావు గ్రంథాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



శివాజీ గణేష్‌ను సన్మానిస్తున్న ఎంపిడిఒ రాధాకృష్ణ

పాకలలో గ్రామ సభ

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండలం పాకల గ్రామంలో ఉపాధి హామీ పథకం గ్రామసభ సోమ వారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ షేక్ జమీఉల్లా మాట్లాడుతూ 2014-15 సంవత్సరానికి సంబంధించి రూ.4.20 కోట్లతో పలు పనులను గ్రామస్తులు ద్వారా బడ్జెట్ తీసుకున్నట్లు తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటలు, చెరువుల అభివద్ధికి ప్రతి రైతూ వినియోగించుకునే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ సుధాకర్, సర్పంచి సైకం చంద్రశేఖర రావు, ఎంపిటిసి అశోక్ రెడ్డి, ఉప సర్పంచి ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శి షేక్ సుభాని పాల్గొన్నారు. అనంతరం ఇటీవల సాగు చేసిన మామిడి మొక్కలను అధికారులు పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు.



మొక్కలను పరిశీలిస్తున్న అధికారులు

ఏం కొనేటట్టు తినేటట్టు లేదు..!



- ఆకాశాన్నంటుతున్న ధరలు
- భారమవుతున్న బతుకులు
- విలవిలలాడుతున్న సామాన్య జనం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ఏం కొనలేం..తినలేం..సామాన్యుల బతుకులు భారమవుతున్నాయి. నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. పప్పు, ఉప్పు, బేడలు, బెల్లం ఇలా ప్రతి ఒక్కటి ధర కొండెక్కి ఉన్నాయి. వాటిని అందుకోవడం తమవల్ల కావడం లేదని పేద ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బియ్యం, మాంసం, నూనె ధరలు విపరీతంగా పెరిగిపోయాయని వాపో తున్నారు. నోట్లోకి ముద్ద దిగాలన్నా నోట్లు ఖర్చు చేయాల్సి వస్తోందని ప్రజలు లబోదిబోమంటున్నారు. ఏ సరుకు ధర చూసినా భగ్గుమంటోంది. రెక్కాడితేకాని డొక్కాడని సామాన్య, మధ్య తరగతి కుటుంబాలపై ధరలు తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసర ధరలతో జనం విలవిల్లాడుతున్నారు.

ఉపాధి లేక అల్లాడుతున్న ప్రజలకు..

అసలే ఉపాధి లేక అల్లాడుతున్న పేద ప్రజల బతుకులు నిత్యం పెరిగిన ధరలతో సతమతమవుతున్నారు. రోజులో ఒక్కపూటైన రుచికర భోజనం తినలేకపోతున్నామని ఆవేదన చెందుతున్నారు. రోజూ మనం ఇంటింటా నిత్యం వినియోగించే పప్పు, బియ్యం ధరలు రాకెట్‌లా దూసుకు పోతున్నాయి. చెబుతుండడంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. గతేడాది ఇదే సమయంలో కందిపప్పు ధర రూ. 130 ఉండేది. ప్రస్తుతం రూ.180కి చేరింది. ఒక కిలో మినపప్పు రూ.140కు చేరింది. మార్కెట్లో బియ్యం ధరలకు కూడా రెక్కలొచ్చాయి. రెండు నెలల క్రితం వరకు సోనా మసూరి ప్రథమ శ్రేణి బియ్యం 25 కిలోలు రూ.1250 ఉండగా, ప్రస్తుతం రూ.1450కు చేరింది. మార్కెట్లో నిత్యావసర ధరలు అందుబాటులో లేకుండా పోయాయి. కొద్ది రోజుల వ్యవధిలోనే ఈ ధరలు రెట్టింపు కావడంతో సామాన్య, మధ్య తరగతి కుటుంబాల పరిస్థితి దయనీయంగా మారింది. గతేడాది చికెన్ ధర కిలో రూ. 160 ఉంటే ప్రస్తుతం ధర రూ.220, మాంసం ధర రూ.650 ఉండగా ప్రస్తుతం ధర రూ.800 ఉంది. మరో వైపు పెట్రోల్, డీజిల్ ధరలు కూడా పెరుగుతూనే ఉన్నాయి. వాహనదారులు సైతం ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. వీటి ప్రభావం నిత్యావసర వస్తువుల రేట్లపై పడుతోందని, ధరల పెరుగుదలకు కారణం ఇదేనని హోల్‌సేల్ వ్యాపారులు చెబుతున్నారు.

జీవించడం కష్టంగా ఉంది



పనికి పోతే రోజుకు రూ.200 వస్తాయి. ఏమి కొనాలో, తినాలో అర్థం కాని పరిస్థితి. సరుకుల ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. జీవనం భారంగా ఉంది.

కేశనపల్లి సుబ్బమ్మ, గృహిణి, యర్రగొండపాలెం .

బతుకు భారంగా మారింది



కేంద్ర ప్రభుత్వం ఎప్పుడికప్పుడు డీజిల్, పెట్రోల్, గ్యాస్ ధరల పెంపుతో పేదల బతుకులు దుర్భరంగా మారాయి. రవాణా ఛార్జీలు పెరిగి నిత్యవసర వస్తువులు, కూరగాయల తదితర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఇది పేదలకు అదనపు భారం పడుతుంది. కేంద్రం చమురు ధరలు తగ్గించాలి. **సీతమ్మ, విశ్రాంత అంగన్‌వాడీ కార్యకర్త, యర్రగొండపాలెం .**

ప్రభుత్వం రేషన్ సరుకులు అందించాలి



గతంలో రేషన్ బియ్యంతో పాటు చక్కెర, కందిపప్పు, శనగపప్పు తదితర సరుకులు అందించే వారని, ప్రస్తుతం బియ్యం, చక్కెర మాత్రమే ఇస్తున్నారు. రేషన్ షాపుల ద్వారా నిత్యవర సరుకులు అందిస్తే సామాన్యులకు కొంతైనా భారం తగ్గుతుంది.

భూసారపు లక్ష్మి, గృహిణి, యర్రగొండపాలెం .

ఎన్నికలపై సిఎం దిశానిర్దేశం

(మొదటిపేజీ తరువాయి)

దిగి ప్రజలను వేడుకున్న వైసిపి ఇప్పుడు సంక్షేమ పథకాలతోనే ముందుకు పోతోంది. ఇన్ని రూ.కోట్లు నేరుగా జనం ఖాతాల్లోకి వెళ్లినా గెలుపు కోసం మళ్లీ పెద్ద ఎత్తున వ్యూహాల్లోకి వెళ్లాల్సిన పరిస్థితి వచ్చింది. తిరిగి సిట్టింగులకు టిక్కెట్లపై ధీమా లేదు. సంక్షేమ ఎజెండా ఏమేరకు గట్టెక్కిస్తుందనేదీ చూడాలి. కేవలం సంక్షేమ పథకాలే ఊపిరిగా వైసిపి నేతలు ఇప్పుడు ఎన్నికల్లోకి అడుగు పెడుతున్నారు.

మా భూమిని ఆక్రమించారు.!

(మొదటిపేజీ తరువాయి)

దిగారు. హెచ్చరిక బోర్డును సైతం లెక్కపెట్టలేదు. స్థానికంగా రెవెన్యూ అధికారులకు పెద్దక్క ఈ విషయమై ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. వారసురాలైన పెద్దక్కకు కాకుండా ఇతరులకు ఆ భూమిలో అవకాశం కల్పించేలా అధికారులు వ్యవహరించడంతో పెద్దక్క సోమవారం నాటి స్పందనలో మార్కాపురం సబ్ కలెక్టర్ సేతు మాధవన్‌ను కలిసింది. జరిగిన కథను వినిపించింది. తమ భూమిలో మరో ఇద్దరు వ్యక్తులు సాగులో ఉన్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని విన్నవించుకుంది. ఆ భూమిపై విచారణ చేసి తమది అని రుజువు అయితే తాము సాగు చేసుకునేందుకు అవకాశం కల్పించాలని వేడుకుంది. అక్కడి అధికారుల అక్రమాలపై చర్యలు తీసుకోవాలని కోరింది.

పేదలందరూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

(మొదటిపేజీ తరువాయి)

యాత్ర నెల్లూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాలో చేసిన తరువాత అనేక సమస్యలు తన దృష్టికి వచ్చాయన్నారు. ఎస్‌సి, ఎస్‌టి గ్రామాలలో కనీస మౌలిక వసతులు లేవని, శ్మశానాలు లేని గ్రామాలు అనేకం ఉన్నాయన్నారు. పేదలకు భూములు లేవని, నిరుద్యోగ, యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక అల్లాడుతున్నారన్నారు. గ్రామాలలో పేదలు అభివృద్ధి చెందాలంటే ఏమైనా ఆస్తి ఉండాలని, భూములు ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలు, ఓసిలలోని పేదలు అభివృద్ధి చెందాలంటే ఒంగోలు డిక్లరేషన్ ప్రకటిస్తున్నామన్నారు. స్వయం ఉపాధి కోసం నిరుద్యోగ యువతకు ప్రతి సంవత్సరం రూ.5 వేల కోట్లు సబ్సిడీగా బడ్జెట్‌లో కేటాయించి రూ.5 లక్షల నుంచి 50 లక్షల వరకు వ్యక్తిగత రుణ సౌకర్యం కల్పించాలన్నారు. నిరుద్యోగ యువత సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల స్థాపనకు ప్రతి సంవత్సరం రూ.5 వేల కోట్లు బడ్జెట్‌లో కేటాయించి కోటి నుంచి 10 కోట్ల వరకు రుణ సౌకర్యం కల్పించాలన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ, ఇతర కార్పొరేషన్‌లలో బ్యాంకు రుణాల స్థానంలో రివాల్వింగ్ ఫండ్ ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ గ్యారంటీతో సబ్సిడీతో కూడిన రుణాన్ని లబ్ధిదారులకు నేరుగా అందించాలనా్కన్నరు. ప్రతి సంవత్సరం ఉద్యోగాల భర్తీ చేయాలని, ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ కల్పించే విధంగా కొత్త చట్టాన్ని తీసుకురావాలన్నారు. వ్యవసాయ కూలిలుగా జీవనం సాగిస్తున్న ఎస్‌సి, ఎస్‌టి కుటుంబాలకు స్యాచురేషన్ విధానంలో 3 ఎకరాల భూమిని పంచాలని, ప్రభుత్వ ఆధీనంలో భూమి లేకపోతే సబ్ ప్లాన్ నిధులతో భూమిని కొనుగోలు చేయాలన్నారు. అసైన్‌మెంట్ చట్ట సవరణ ఉపసంహరించుకోవాలని, ఇంతవరకు అన్యాక్రాంతమైన భూమిని తిరిగి అదే కుటుంబం లేదా వారసులకు ఇప్పించాలన్నారు. వికలాంగుల పెన్షన్ రూ.5 వేలు ఇవ్వాలని, ఇతర పెన్షన్లు రూ.4 వేలు నెలకు అందించాలన్నారు. చేనేత రంగంలో ఇన్‌పుట్ మెటీరియల్‌పై వేస్తున్న జిఎస్‌టిని పూర్తిగా తొలగించాలన్నారు. నిరుపేద మహిళల స్వయం సహాయక సంఘాలకు సామాజిక పెట్టుబడి నిధి ఒక్కొక్క సంఘానికి రూ.30 లక్షలు చొప్పున అందించటానికి సెర్ప్ స్థాయిలో రివాల్వింగ్ ఫండ్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ ప్రతిపాదనలను సాధించేందుకు ఐక్యతా విజయ పథం ముందు ఉంటుందని, ఒంగోలు డిక్లరేషన్ వివరాలు త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఐక్యతా విజయ పథం యాత్రకు ఘన స్వాగతం పలికిన దళిత, ప్రజా, ఉద్యోగుల సంఘాల నాయకులు, మహిళలకు జిఎస్‌ఆర్‌కెఆర్ విజయకుమార్ ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం పూర్వపు కలెక్టర్ విజయకుమార్ దంపతులను దళిత, ప్రజా సంఘాలు, ఉద్యోగ సంఘాల నేతలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు మాలమహానాడు రాష్ట్ర గౌరవాధ్యక్షులు బిళ్ళా చెన్నయ్య, విజేంద్ర బహుజన్, మాల మహాసభ రాష్ట్ర అధ్యక్షులు మల్లెల వెంకట్రావు, చార్వాక్, ఉద్యోగ సంఘాల నాయకులు పి.డేవిడ్, కత్తి కళ్యాణ్, అంబేద్కర్, రఘు, సురేష్, దళిత, ప్రజా సంఘాల నాయకులు, ఒంగోలు, కొత్తపట్నం మండలాల నుంచి ఎస్‌సి, ఎస్‌టిలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం బోల్తా పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తా పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని రాయవరం రైల్వే స్టేషన్ సమీపంలోని రైల్వే ఓవర్ బ్రిడ్జి పై సోమవారం రాత్రి చోటుచేసుకుంది. అందిన వివరములు ప్రకారం దొనకొండ మండలం, పడమట వెంకటాపురం గ్రామానికి చెందిన కే. నగేష్ అనే తన సొంత పని నిమిత్తం మార్కాపురం పట్టణంకు వచ్చి పని ముగించుకొని తిరిగి స్వగ్రామం కు వెళ్తున్న క్రమంలో సరిగ్గా ప్రమాద స్థలి వద్దకు రాగానే ద్విచక్ర వాహనం ఒక్కసారిగా అదుపుతప్పి బోల్తా పడింది ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనం నడుపుతున్న కే. నగేష్ కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటన గురించి సమాచారం అందుకున్న మార్కాపురం గ్రామీణ పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలం కు చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. ఈమేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్కాపురం ప్రభుత్వ జిల్లా వైద్యశాలకు తరలించినట్టు గ్రామీణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఎంకటేశ్వర నాయక్ తెలిపారు.



అగ్రి ప్రమాదంలో మృతి చెందిన గేదె

అగ్నిప్రమాదంలో మూగజీవాలు మృతి

ప్రజాశక్తి-రేపల్లె

అగ్నిప్రమాదం సంభవించి పశువులు మృతి చెందిన సంఘటన మండలంలోని మైనేనివారిపాలెంలో జరిగింది. సేకరించి వివరాల ప్రకారం చాట్రాగడ్డ పంచాయతీ పరిధిలోని మైనేనివారిపాలెంలో రైతు తన కున్న పశువులకు దోమలు కుట్టకుండా ఉండేందుకు ఆదివారం సాయంత్రం పొగ వేశాడు. ప్రతిరోజు పొగ వేసే విధంగా ఆదివారం రాత్రి కూడా గడ్డి వెలిగించి పడుకున్నారు. గడ్డి క్రమంగా కాలుతూ పెద్ద మంటలు చెలరేగి పశువుల సావిడికి వ్యాపించాయి. అయితే రైతు నిద్రలో ఉండడంతో పాకలో కట్టివేసిన మూడు చూడు గేదలు నాలుగు గొర్రెలు, కోళ్లు అగ్నికి ఆహుతి అయ్యాయి. ఈ ప్రమాద ధాటికి కట్టి వేసిన పశువులు కాలిపోయి అలాగే చనిపోయాయి. విషయం తెలుసుకున్న రెవెన్యూ, పశుసంవర్ధక శాఖ అధికారులు ఘటన ప్రాంతాన్ని పరిశీలించారు. పశువులకు ఉన్న ఇన్సూరెన్స్ ఇప్పించేందుకు కృషి చేస్తామని చెప్పారు.



బ్రెయిన్ స్ట్రోక్‌తో మహిళా పోలీసు మృతి

ప్రజాశక్తి-చీమకుర్తి



మార్పుడి శ్యామల

మండలంలోని గోనుగుంట సచివాలయంలో మహిళా పోలీసుగా పనిచేస్తున్న మార్పుడి శ్యామలా(45) బ్రైన్‌స్ట్రోక్‌తో సోమవారం మృతి చెందారు. అందిన వివరాల ప్రకారం శ్యామలా స్వగ్రామం సంతనూతలపాడు. ఆమె అక్కడే నివాసం ఉంటూ గోనుగుంట సచివాలయంలో మహిళా పోలీసుగా పనిచేస్తుంది. ఆమెకు ఆదివారం తీవ్రమైన జ్వరం రావడంతో ఆమెను చికిత్స నిమిత్తం ఒంగోలులోని సూర్య ఆసుపత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం 6 గంటల సమయంలో మృతి చెందారు. శ్యామలా భర్త చంద్రశేఖర్ చీమకుర్తి ప్రాంతంలోని గ్రానైట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. వారి కుమారులు ఇద్దరు డిగ్రీ చదువుతున్నట్లు తెలిసింది.

నాటుసారా నిందితులకు జైలు శిక్ష

దర్శి : ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నాటుసారా తయారు చేసి విక్రయాలకు పాల్పడుతూ పట్టుబడిన తాళ్లూరు మండలం వెలుగువారిపాలెం గ్రామానికి చెందిన నాగులూరి ఏసు, అరుణ్‌కుమార్‌లకు రెండు సంవత్సరాల ఆరు నెలల జైలు శిక్ష, రూ.6లక్షలు జరిమాన విధిస్తూ దర్శి మెజిస్ట్రేట్ సోమవారం తీర్పు వెల్లడించినట్లు ఎస్ఈబీ సీఐ సుందరరామయ్య తెలిపారు. 13-03-2021లో 300 లీటర్ల నాటుసారా, 2700 లీటర్ల బెల్లం ఊటతో వెలుగువారిపాలెం గ్రామంలో పట్టబడ్డాడు. ఈ సందర్భంగా నాగులూరి ఏసు ఇటీవల చనిపోయాడు, అరుణ్‌కుమార్‌కు శిక్ష ఖరారు చేసినట్లు తెలిపారు.

అక్రమంగా అమ్ముతున్న మద్యం పట్టివేత

ప్రజాశక్తి-సంతమాగులూరు

మండలంలోని మిన్నే కల్లు గ్రామంలో సోమవారం రాత్రి ఎటువంటి లైసెన్సులు లేకుండా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని గుర్తించి అతని వద్ద ఉన్న (180 ఎం ఎల్) 40 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ ఐ ఎమ్ వి శివకుమార్ తెలిపారు. సదరు అమ్మకం దారుని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



గడ్డికోత మిషన్ బహుకరించిన రోటరీ ప్రతినిధులు

గడ్డికోత మిషన్ బహూకరణ

ప్రజాశక్తి - పర్చూరు

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మండలంలోని నూతలపాడు పంచాయితీకి గడ్డి, కలుపు, నాచు కత్తిరించే మిషన్‌ను క్లబ్ అధ్యక్షుడు నాగబైరు శ్రీనివాసరావు చేతుల మీదుగా సెక్రెటరీ బీమినేని హరిప్రసాద్‌కు అందచేశారు. ఈ సందర్భంగా పంచాయితీ సెక్రటరీ మాట్లాడుతూ నూతలపాడు గ్రామ అవసరములకు అడిగిన వెంటనే వనరులు, వస్తువులు సమకూరుస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులకు ధన్య వాదంలు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి పంబి సదానందరెడ్డి, సభ్యులు భవనం రాజగోపాలరెడ్డి, పాబోలు వెంకన్న, కారుముడి సుబ్బారెడ్డి, ఉప సర్పంచ్ వనుకూరి బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.



హెచ్‌ఎం దంపతులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

హెచ్‌ఎం దంపతులకు సన్మానం

ప్రజాశక్తి - కర్లపాలెం

మండలంలోని ఎంవి రాజుపాలెం జెడ్‌పి ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా పనిచేసి, ఇటీవల బదిలీపై నందిరాజుతోట జెడ్‌పి ఉన్నత పాఠశాలకు వెళ్లిన ఆకురాతి సత్యన్నారాయణ దంపతులను ఉపాధ్యాయులు సోమవారం ఘనంగా సత్కరంచారు. దుశ్శాలువా, పూల దండలతో ఘనంగా సన్మానించి జ్ఞాపిక బహూకరించారు. ప్రస్తుత హెచ్‌ఎం విజయభాస్కరరెడ్డి మాట్లాడుతూలి సత్యన్నారాయణ ఏడు సంవత్సరాల 8నెలలకుపైగా తమ పాఠశాలకు విశిష్ట సేవలు అందించారని అన్నారు. పాఠశాల అభివృద్ధికి, పిల్లల విద్యాభివృద్ధికి కృషిచేశారని అన్నారు. ఆయన కాలంలో పది ఫలితాలు కూడా బాగా వచ్చాయని అభినందించారు. సత్యన్నారాయణ మాట్లాడుతూ తన పదవీ కాలంలో సహకరించిన ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సిహెచ్‌టివి సురేష్, జి శ్రీనివాసరావు, పి నాగేంద్రరెడ్డి, ఎవి ఆదిలక్ష్మి, వి అనూరాధ, నాగలక్ష్మి, పిఇటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పురాతన పోస్టల్ స్టాంపులు తిలకిస్తున్న ప్రజలు

చరిత్రకు సాక్ష్యాలు తపాలా బిళ్లలు

ప్రజాశక్తి - బాపట్ల

తరతరాల చరిత్రకు తపాలా బిళ్ళలు సాక్షాలుగా నిలుస్తాయని హెడ్ పోస్ట్ మాస్టర్ జివి సత్యనారాయణ అన్నారు. ప్రపంచ తపాలా దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రధాన తపాలా కార్యాలయంలో ఫోరం ఫర్ బెటర్ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన తపాలా బిళ్ళల ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. సత్యనారాయణ మాట్లాడుతూ అనేక చారిత్రక ఘట్టాలను, విశేషాలను తపాలా బిళ్ళల ద్వారా తెలుసుకోవచ్చని తెలిపారు. మహనీయుల చిత్రాలను దర్శించవచ్చని అన్నారు. తపాలా బిళ్ళల సేకరణ ద్వారా నేటి విద్యార్థులకు, చిన్నారులకు ఎన్నో విషయాలను అవగతం చేయవచ్చని అన్నారు. వారిలో సామాజిక దృక్పథం పెంపొందుతుందని అన్నారు. ప్రదర్శనను పాస్ పోర్ట్ కార్యాలయానికి, తపాలా కార్యాలయానికి విచ్చేసిన పలువురు సందర్శించి తిలకించారు. కార్యక్రమంలో ఫోరం కార్యదర్శి పిసి సాయిబాబు, నందా ఆంజనేయదత్తు, ఏపీఎం పి నరసింహారావు, సిపిసి డి నాగరాజు పాల్గొన్నారు.

ప్రజారోగ్యం కోసమే ఆరోగ్య సురక్ష


ఆరోగ్య శ్రీ ప్రత్యేక అధికారి డాక్టర్ యాదాల అశోక్ బాబు



సురక్ష కిట్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ యాదాల అశోక్‌బాబు

ప్రజాశక్తి - చిన్నగంజాం

జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపును ఏపీ ఆరోగ్యశ్రీ ప్రత్యేక అధికారి డాక్టర్ యాదాల అశోక్ బాబు సోమవారం పర్యవేక్షించారు. మండలంలోని కడకుదురు పంచాయతీలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిభిరంలో ఆయన మాట్లాడారు. ఇంటి వద్ద వైద్యం అందించే విదంగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. వైద్యశిభిరంలో ఏడు రకాల పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. 172రకాల మందులు ఉచితంగా అందజేస్తు న్నారని తెలిపారు. ఇవన్నీ ప్రైవేట్ హాస్పటల్లో చేయించు కోవాలంటే రూ.2వేలకు పైగా అవుతాయని తెలిపారు. 45రోజుల పాటు సాగే వైద్యశిభిరంలో అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు కార్పొరేట్ హాస్పిటల్లో చేసే విధంగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కంటి సంబంధిత వ్యాధులకు అక్కడికక్కడే పరిష్కారం చూపుతూ అవసరమైన కళ్ళజోళ్ళు ఇవ్వనున్నట్లు తెలిపారు. అంగన్వాడీలు ఏర్పాటు చేసిన జగనన్న పౌష్టికాహారం పరిశీలించారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నపిల్లలకు సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గతంలో కంటే మెరుగ్గా క్వాలిటీ పౌష్టికాహారం అందిస్తున్నారని అన్నారు. వైద్యశిభిరంలో 562మందికి వైద్యపరీక్షలు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ జి శివ కుమారి, ఎంపిడిఓ కె స్వరూపరాణి, ఈఓఆర్డి ఎన్‌విజికె మూర్తి, ఎంఈఓ-2, సంతరావూరు పిహెచ్‌సి వైద్య బృందం, పంచాయతీ కార్యదర్శి ఎన్ సూర్యనారాయణ పాల్గొన్నారు.



సురక్ష వైద్యశిభిరాన్ని పరిశీలిస్తున్న కృష్ణచైతన్య

పంగులూరు : జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు శాప్ నెట్ చైర్మన్, వైసిపి ఇన్చార్జి బాచిన కృష్ణ చైతన్య అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిభిరం మండలంలోని తూర్పు కొప్పెరపాడు గ్రామంలో సోమవారం నిర్వహించారు. సంక్షేమ పదకాల ద్వారా ప్రజలకు చేరువైన సిఎం వైఎస్ జగన్ మళ్లీ సిఎం కావడం ఖాయమని అన్నారు. ఎంపిడిఒ బి రామాంజనేయులు పర్యవేక్షణలో జరిగిన వైద్యశిభిరంలో నలుగురు స్పెషలిస్ట్ డాక్టర్స్ వైద్యపరీక్షలు చేశారని అన్నారు. 318 టోకెన్సు రైజ్ చేయగా 405ఓపిలు నమోదయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో తూర్పకొప్పెరపాడు సర్పంచ్ వై కళ్యాణి, తూర్పు తక్కెళ్ళపాడు సర్పంచ్ మేడూరి అంజయ్య, ఎంపిటిసి నూకతోటి సింధూర, మాజీ సర్పంచి సుబ్బారావు, వైసీపీ నాయకులు ఇనుకపాటి శ్రీనివాసరావు, పంగులూరు పిహెచ్‌సి డాక్టర్ శివ చెన్నయ్య, ఎంఇఒ వీరాంజనేయులు, ఈఓఆర్డి రాంబాబు పాల్గొన్నారు.



ఆరోగ్య సురక్ష కిట్లు పంపిణీ చేస్తున్న నగరం తహశీల్దారు

నగరం : మండలంలోని బోరమాధిగపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిభిరాన్ని తహశీల్దారు ఎం శ్రీనివాస రావు సోమవారం ప్రారంబించారు. పేదల ఆరోగ్యానికి భరోసా ఇచ్చేందుకే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని తీసుకొచ్చారని అన్నారు. అనుభవజ్ఞులైన వైద్యులు, వైద్య సిబ్బంది శిబిరాల్లో ఆరోగ్య పరీక్షలు చేస్తారని చెప్పారు. ఆరోగ్య సమస్యలుంటే ఉచితంగా మందులు అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ నల్లూరి రత్నబాబు, ఎంపిటిసి నల్లూరి శ్రీమన్నారాయణ చార్యులు, డి కొండలరెడ్డి పాల్గొన్నారు.



సురక్ష వైద్యశిభిరంలో వివరాలు తెలుసుకుంటున్న నేతాజీ

చీరాల : ప్రజలందరికీ వైద్యం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ఇంటి వద్దనే వైద్య పరీక్షలు నిర్వహిస్తుందని ఎంపిడిఓ నేతాజీ అన్నారు. మండలంలోని ఈపురుపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిభిరం సోమవారం నిర్వహించారు. వైద్యశిభిరానికి 300మందికిపైగా హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్‌బికె చైర్మన్ కావూరి రమణారెడ్డి, వైసిపి నాయకులు బిట్రా శీను, మాజీ వైస్ ఎంపిపి నాదెండ్ల కోటేశ్వరావు, బుర్ల మురళి, ఎస్‌కె మస్తాన్, బండారు జ్వాలానరసింహం, వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.



సురక్ష సభలో మాట్లాడుతున్న పేటేరు వైసిపి ఇన్‌ఛార్జి రవి

రేపల్లె : ప్రజలందరికీ మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష ప్రవేశపెట్టారని వైసీపీ పేటేరు ఇంచార్జీ కనపర్తి రవికిరణ్ తెలిపారు. మండలంలోని పేటేరు జెడ్‌పి హైస్కూల్ ఆవరణంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిభిరంలో ఆయన మాట్లాడారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ, స్పెషల్ ఆఫీసర్, సర్పంచ్ కనపర్తి వసుమతి పాల్గొన్నారు.



వైసిపి సదస్సులో ఎంపిపి, జెడ్‌పిటిసి, వైసిపి అధ్యక్షులు

విజయవాడ సదస్సులో వైసిపి నేతలు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

విజయవాడ ఇందిరాగాంధీ పార్కులో సోమవారం జరిగిన వైసిపి సమావేశానికి వేమూరు ఎంపీపీ మోహన్, జడ్పిటిసి గాజుల హేమలత, వైసిపి మండల అధ్యక్షులు బుల్లిమంత ఏడుకొండలు, పిఎసిఎస్ చైర్మన్ గాజుల భాను ప్రకాష్, సర్పంచ్ ధారా రవికిరణ్మయి, చెన్నయ్య, మాల శ్రీనివాసరావు హాజరయ్యారు.



సదస్సుకు హాజరైన వెంకటేష్‌తోపాటు చీరాల నేతలు

చీరాల : వైసీపీ ఇంచార్జీ కరణం వెంకటేష్ తో పాటు డైరక్టర్లు గవిని శ్రీనివాసరావు, మళ్ళీ వైష్ణవి, చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్లు బొనిగల జైసన్ బాబు, రామసుబ్బులు, పార్టీ అధ్యక్షులు కొండ్రు బాబ్జి, గుంటూరు మాధరావు, అసాది అంకాళరెడ్డి, బొడ్డు సుబ్బారావు, చీమకుర్తి బాలకృష్ణ హాజరయ్యారు.

కాన్షీరాంకు ఘన నివాళి

ప్రజశక్తి - చీరాల

భారతరాజ్యాగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబెద్కర్ కలలు కన్న బహుజన రాజ్యనిర్మాత మాన్యశ్రీ కాన్షిరాం అని వక్తలు పేర్కొన్నారు. బిఎస్‌పి వ్యస్తాపకులు మాన్యశ్రీ కాన్షిరాం 17వ వర్ధంతి సందర్భంగా స్థానిక గడియార స్థంభం వద్ద ఉన్న కాన్షీరాం విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బిఎస్‌పి నియోజకవర్గ అధ్యక్షులు గొర్రెపాటి రవి కుమార్, బీఎస్పీ సీనియర్ నాయకుడు దుడ్డు భాస్కరరావు, కన్వీనర్ కాటి మార్క్ మాట్లాడుతు దేశాన్ని వివక్షకు గురి అవుతున్న మహిళలు కూడా పాలించగలరని బిఎస్‌పి ద్వారా అతిపెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌లో అధికారానికి తీసుకొచ్చారని అన్నారు. మనువాదుల కోటైన ఉత్తరప్రదేశ్‌లో నాలుగు సార్లు మాయావతిని ముఖ్యమంత్రి చేసిన ఘనత ఆయనదేనని అన్నారు. కార్యక్రమములో బిఎస్‌పి జిల్లా ఇంచార్జ్ చిట్టిమాల సంగీతరావు, నియోజకవర్గ కోశాధికారి చీమకుర్తి వంశీకృష్ణ, కుంచాల పుల్లయ్య, డేనియల్, ప్రసాద్, జగదీష్, శ్రీను, పృధ్వీరాజ్, ఫాస్టర్ దేవ సహాయం, జోసెఫ్, కలాం, షరీఫ్, చిరంజీవి, డి బ్రహ్మయ్య, జగన్మోహన్, ఎం మణిబాబు పాల్గొన్నారు.



చీరాలలో కాన్షీరాంకు నివాళి అర్పిస్తున్న బిఎస్‌పి నేతలు



అద్దంకిలో కాన్షీరాం చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నేతలు

అద్దంకి : మాన్యశ్రీ కాన్షీరాం ఆయశాలను కొనసాగిస్తామని బహుజన సమాజ్ పార్టీ అధ్యక్షులు మందా జోసెఫ్ అన్నారు. స్థానిక డాక్టర్ బిఆర్ అంబేద్కర్ భవన్లో సోమవారం కాన్షీరామ్ 17వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. తొలుత కాన్షిరాం చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కాన్షిరాం మరణించి 17సంవత్సరాలు గడిచినా ఆయన చేసిన సేవలు నేటికీ ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేశాయని అన్నారు. అంబేద్కర్ సాధించిన ఓటు హక్కును భారత రాజ్యాంగంలో పొందుపరిచి అన్ని హక్కులను ఉపయోగించుకుంటూ భారతదేశం అంతా కూడా 40వేలకిలోమీటర్లు తిరిగి ప్రచారం చేశారని అన్నారు. ఓటు హక్కు ద్వారా ఉత్తరప్రదేశ్లో రాజ్యాధికారం తీసుకొచ్చిన వ్యక్తి కాన్షీరాం అని కొనియాడారు. అనంతరం కాన్సిరామ్ విగ్రహావిష్కరణ, కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో జై భీమ్ భారత్ పార్టీ నియోజకవర్గ అధ్యక్షులు పులిపాటి హేబెలు, ఆమ్ ఆద్మీ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ రాచపూడి వెంకట నరసింహారావు, దాసర బుల్లియ, మనం కోటేశ్వరరావు, పాస్టర్ చంద్రయ్య, మేదర నాగేశ్వరరావు, కొండ్రు మరియబాబు పాల్గొన్నారు.

బిజెపి ప్రభుత్వ విధానాలను ప్రతిఘటించాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు

ప్రజాశక్తి-కొండెపి

ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ విధానాలను ప్రతిఘటించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని పెరిదేపి గ్రామ పొలాల్లో పనిచేస్తున్న కూలీలతో సోమవారం మాట్లాడారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టం అనేక పోరాటాలు, త్యాగాలతో సాధించుకున్నట్లు తెలిపారు. స్వాతంత్ర ఉద్యమ కాలం నుంచే కష్టజీవులకు పనైనా చూపండి, తిండైనా పెట్టండి అనే నినాదంతో వ్యవసాయ కార్మిక సంఘం అనేక పోరాటాలు సాగించినట్లు తెలిపారు. దున్నేవానికి భూమి దక్కాలని నిర్వహించిన పోరాటాల ఫలితంగా భూసంస్కరణల చట్టాలు వచ్చినట్లు తెలిపారు. కనీస వేతనాలు , పని గ్యారంటీ ఉండాలని చేసిన ఉద్యమాలు ఉపాధి హామీ చట్టం లాంటి పథకాలు రావటానికి దారితీసినట్లు తెలిపారు. 2004లో పార్లమెంట్‌లో 62 మంది వామపక్షాల ఎంపీలు ఉన్న దశలో తమ ప్రభుత్వం మనుగడ కోసం వారి మద్దతు తీసుకున్న అప్పటి యుపిఎ ప్రభుత్వం 18 మందికి మంత్రి పదవులు ఇస్తామని చెప్పినట్లు తెలిపారు. అయితే తమకు పదవులు కాదని, ప్రజలకు హక్కులు, చట్టాలు కావాలని వామపక్షాలు పట్టుపట్టినట్లు తెలిపారు. ఆ సందర్భంలో ఉపాధి హామీ చట్టం వచ్చినట్లు తెలిపారు. ఈ చట్టం వచ్చాక గ్రామీణ ప్రాంత పేదలకు కొంత ఆసరాగా ఉందన్నారు. వారి జీవన ప్రమాణాలు మెరుగుదలకు కొంత దోహద పడిందన్నారు. పేదరికం, వలసల నివారణ, గ్రామీణ ప్రాంతాల్లో శాశ్వత ఆస్తులు సమకూర్చడం లాంటి ఉన్నత లక్ష్యాలతో ఉపాధి చట్టాన్ని నాడు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చినట్లు తెలిపారు. వంద రోజులు పనిదినాలు, రూ.100 కూలీతో ప్రారంభమైన ఉపాధి హామీ చట్టం వ్యవసాయ కార్మిక సంఘాలు చేసిన పోరాటాల ఫలితంగా కనీస వేతనం నేడు రూ.257 పెరిగినట్లు తెలిపారు. దేశ ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలో ఉందని, ఈ దశలో ప్రజల కొనుగోలు శక్తి పెరగాలంటే గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పట్టణాలకు కూడా విస్తరించాలన్నారు. ఏడాదికి 200 రోజుల పనిదినాలు, రోజు వారీ కనీస వేతనం 600 ఇవ్వాలని దేశంలోని అనేక మంది ఆర్థిక వేత్తలు కోరుతున్నట్లు తెలిపారు. కేంద్ర బడ్జెట్‌లో రూ. 2 లక్షల 60వేల కోట్లు కేటాయిస్తే మందగమనంలో ఉన్న ఆర్థిక వ్యవస్థ మెరుగుపడుతుందని మేధావులు చెప్తున్నారని పేర్కొన్నారు. ఇలాంటి విషయాలు చెవి కెక్కని మోడీ ప్రభుత్వం ఉపాధి హామీకి క్రమంగా నిధులు తగ్గిస్తూ నిర్వీర్యం చేసేందుకు పూనుకుంటున్నదని విమర్శించారు. అందులో భాగంగా ఉపాధి హామీ చట్టానికి నిధులు తగ్గిస్తున్నట్లు తెలిపారు. మోడీ తిరిగి అధికారంలోకి వస్తే ఇలాంటి చట్టాలు కనుమరుగయ్యే ప్రమాదం ఉందన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కెజె.మస్తాన్ మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో పని దినాలు క్రమంగా కుదించబడుతున్నాయని తెలిపారు. యాంత్రీకరణ పెరిగినట్లు తెలిపారు. ప్రకృతిలో వస్తున్న మార్పుల కారణంగా పనులు లేక గ్రామీణ పేదలు పట్టణాలకు పెద్ద సంఖ్యలో వలసలు పోతున్నట్లు తెలిపారు. కేరళ , తమిళనాడు రాష్ట్రాల్లో ఈ పాటికే పట్టణ ఉపాధి హామీ పథకం ప్రారంభించినట్లు తెలిపారు. మన రాష్ట్రంలోనూ పట్టణ ఉపాధి పథకం ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు అంగలకుర్తి కోటేసు, ఎ.సుబ్బారావు, ఎ.జయరావు, ఎల్.నిర్మల, ఎ.ఆదాం, మల్లెల నిర్మల, ఎ.ముసలయ్య తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కంకణాల ఆంజనేయులు

కమిషనర్ స్పందనకు 18 అర్జీలు

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

నగర ప్రజా సమస్యల పరిష్కారం కోసం నగరపాలక సంస్థ కమిషనర్ ఎం. వెంకటేశ్వరరావు సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై 18 మంది అర్జీలు అందజేశారు. అందులో పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి నాలుగు అర్జీలు, టిడ్కో ఇళ్లకు సంబంధించి ఐదు అర్జీలు, రెవెన్యూ విభాగానికి సంబంధించి మూడు అర్జీలు, ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి రెండు అర్జీలు, పారిశుధ్య విభాగానికి సంబంధించి నాలుగు అర్జీలు అందాయి. ఆయా అర్జీలను పరిష్కరించాలని సంబంధింత సెక్షన్ హెడ్‌లను కమిషనర్ ఆదేశించారు. విభాగాల వారీగా వచ్చిన అర్జీలను ఆయన సెక్షన్ హెడ్‌లుగా ఉన్న అధికారులకు బదలాయించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని నగర ప్రజలు వినియోగించు కోవాలని కోరారు.


అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

రైతులకు పిఎండిఎస్ కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండలం కలికివాయ రైతు భరోసా కేంద్రం వద్ద ఎస్‌సి రైతులకు పిఎండిఎస్ కిట్స్ పంపిణీ చేశారు. గ్రామ సర్పంచి, ఎఒ చేతుల మీదుగా పిఎండిఎస్ కిట్లు అంద జేశారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ రైతులు నవ ధాన్యాలు సాగు చేసి అధిక ప్రయోజనం పొందాలన్నారు. ప్రకృతి వ్యవసాయం ఎన్‌డిఎ వెంకటరమణ మాట్లాడుతూ పంటలు సాగు చేసే 45 రోజులు ముందుగానే నవధాన్యాలు సాగు చేయాలన్నారు. పూత దశలో మొక్కలను భూమిలో కలియ దున్నివేయాలన్నారు. అలా చేయడం వల్ల భూమిలో సూక్ష్మజీవులు వృద్ధి చెందుతాయని తెలిపారు. దీంతో భూమిలో జీవన ద్రవ్యం ఏర్పడి నేల సారవంతం అవుతుందన్నారు. ఫలితంగా పంటలు ఆరోగ్యంగా పెరిగి అధిక దిగుబడులు వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి చిడిపూడి వెంకటరత్నం, విఎఎ శారద, లీడ్ ఫార్మర్ దాసరి నాగసుమతి, రైతులు పాల్గొన్నారు


రైతులకు కిట్లు అందజేస్తున్న అధికారులు

11, 12 తేదీల్లో ఎంపీ మాగుంట పర్యటన

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి ఈ నెల 11, 12 తేదీలలో పలు కార్యక్రమాలలో పాల్గొననున్నారు. ఈనెల 11న ఉదయం 8 గంటలకు తన కార్యాలయంలో మాగుంట కార్యకర్తలకు అందుబాటులో ఉంటారు. 10 గంటలకు ఒంగోలులో స్థానికంగా జరిగే కార్యక్రమాలకు హాజరవుతారు. 11.30 గంటలకు తన కార్యాలయంలో కార్యకర్తలకు అందుబాటులో ఉంటారు. సాయంత్రం 3 గంటలకు ఒంగోలు ప్రకాశం భవనంలోని స్పందన సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న దిశా కమిటీ (జిల్లా డెవలప్‌మెంట్ కోర్డినేషన్, మానిటరింగ్ కమిటీ) సమావేశంలో పాల్గొంటారు. సాయంత్రం 6 గంటలకు తన కార్యాలయంలో కార్యకర్తలకు అందుబాటులో ఉంటారు. ఈనెల 12న ఉదయం 8.30 గంటలకు తన కార్యాలయంలో కార్యకర్తలకు అందుబాటులో ఉంటారు. ఉదయం 10.30 గంటలకు ఒంగోలులో దక్షిణ బైపాస్ వద్ద ఉన్న పాత జిల్లా పరిషత్ భవనంలో నిరవహిస్తున్న జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశంలో పాల్గొంటారు.

జగన్ ఏం అభివృద్ధి చేశారు?

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ముఖ్యమంత్రి జగన్ రాష్ట్రానికి ఏమి అభివృద్ధి చేశారో, ఎందుకు మళ్ళీ ముఖ్యమంత్రిగా రావాలని కోరుకోవాలో చెప్పాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం ఒంగోలు వచ్చిన ఆయన స్థానిక మల్లయ్య లింగం భవనంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రాన్ని అప్పులపాలు చేయడంలో, విధ్వంసం సృష్టించటంలో జగన్ ప్రధాన సూత్రధారి అని తెలిపారు. గుండ్లకమ్మ ప్రాజెక్టుకు పదిసార్లు టెండర్లు పిలిచినా ఒక్క కాంట్రాక్టర్ ముందుకు రాలేదని నీటిపారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు చెప్పటం సిగ్గుపడాల్సిన విషయమన్నారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు మూడో నెంబర్ గేటు కొట్టుకుపోయి సంవత్సరం దాటిన నిర్మాణంలో ఒక్క అడుగు ముందుకు పడకపోవడం జగన్ ప్రభుత్వం చేతకాని తనమేనన్నారు. నీటి కేటాయింపులను నిరసిస్తూ ఈనెల 18న కడపలో రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రానున్న ఎన్నికలలో టిడిపి, జనసేన, వామపక్షాలు కలిసి పోటీ చేసి ఘన విజయాన్ని సాధిస్తాయని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.ఎల్.నారాయణ పాల్గొన్నారు.




మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ


అవార్డు అందుకుంటున్న మద్దాళి మాధవరావు

మద్దాళికి ఎన్‌డిసిఎ అవార్డు

ప్రజాశక్తి-చీమకుర్తి

అభయకళారాధన అధ్యక్షుడు మద్దాళి మాధవరావు నార్త్ ఢిల్లీ కల్చరల్ అకాడమి (ఎన్‌డిసిఎ) అవార్డును అందుకున్నారు. హైదరాబాదులోని చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో ఎన్‌డిసిఎ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణా స్పీకర్ సిరికొండ మధుసూధనాచారి, ఎన్‌డిసిఎ ఛీఫ్ కోఆర్డినేటర్ డాక్టర్ బింగి నరేంద్ర గౌడ్ చేతుల మీదుగా మద్దాళి అవార్డు, సర్టిఫికెట్, ప్రశంసా పత్రం అందుకున్నారు. మద్దాళి మాధవరావు చీమకుర్తి ప్రాంతంలో వివిధ రంగాల్లో అందించిన సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో నరేంద్రరెడ్డి,టిఆర్ఎస్ నాయకుడు మహమ్మద్‌గౌస్,డాక్టర్ ఉపేంద్రవర్మ పాల్గొన్నారు.


రిఫ్రిజిరేటర్‌ను అందజేస్తున్న రోటరీక్లబ్ నాయకులు

రిఫ్రిజిరేటర్లు బహూకరణ

ప్రజాశక్తి-చీమకుర్తి

మండల పరిధిలోని గాడిపర్తివారిపాలెంలో నున్న పోలేరమ్మ, సాయిబాబా ఆలయాలకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రిఫ్రిజిరేటర్లు, స్టాండ్ ఫ్యాన్లు సోమవారం బహూకరించారు. ఈ సందర్భంగా రోటరీక్లబ్ నాయకులు మాట్లాడుతూ గతంలో ఇచ్చిన హామీ మేరకు రిఫ్రిజిరేటర్లు, స్టాండ్ ఫ్యాన్లు అందజేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో రోటరీక్లబ్ నాయకులు గుండా వెంకటేశ్వర్లు, వీరారెడ్డి,గొల్లపూడి చౌదరి, పివిఎస్.మూర్తి, ముప్పూరి చలమయ్య, బూదవాడ ఉపసర్పంచి మేదరమెట్ల శ్రీనివాసులు, విశ్రాంత తహశీల్దారు అంకమ్మరావు తదితరులు పాల్గొన్నారు.


వాటర్ బాటిళ్లు అందజేస్తున్న దాత

వాటర్ బాటిళ్లు పంపిణీ

ప్రజాశక్తి-సిఎస్ పురంరూరల్

విద్యాభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని సింగిల్ విండో అధ్యక్షుడు పెరుగు సుబ్బరామయ్య, నవోదయ హ్యూమన్ రైట్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ షేక్ గౌస్ తెలిపారు. మండల పరిధిలోని చెన్నపనాయుని పల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు గ్రామానికి చెందిన దుద్దేల శేషయ్య సోమవారం వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎండలు ఎక్కువగా ఉన్న ప్రస్తుత తరుణంలో విద్యార్థులకు సకాలంలో నీరు తాగేందుకు ఈ వాటర్ బాటిళ్లు ఎంతగానో ఉపయోగ పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చాంద్ బాషా, దాత దుద్దేల శేషయ్య, గ్రామస్తులు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు



కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న బాధితులు

తాళ్లూరు తహశీల్దారును సస్పెండ్ చేయాలి

- కలెక్టరేట్ వద్ద డిహెచ్‌పిఎస్ ధర్నా

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

కలెక్టర్ ఆదేశాలు ఇచ్చినా ఏడు నెలలుగా ఎస్‌సి, ఎస్‌టి కేసుల్లో నివేదికలు పంపని తాళ్లూరు తహశీల్దారు ప్రసాద్‌ను సస్పెండ్ చేసి అరెస్ట్ చేయాలని దళిత నేత నీలం నాగేంద్రరావు డిమాండ్ చేశారు. ఎస్‌సి, ఎస్‌టి కేసుల్లో రిపోర్టులు పంపకుండా అలసత్వం వహిస్తూ వారిని వేధిస్తున్న తాళ్లూరు తహశీల్దారును అరెస్ట్ చేయాలని కోరుతూ దళిత హక్కుల పరిరక్షణ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకూ బాధితుల సోమవారం నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత సంఘాల ఐక్య వేదిక అధ్యక్షుడు చప్పిడి వెంగళరావు మాట్లాడుతూ ఎస్‌సి,ఎస్‌టి కేసుల్లో కలెక్టర్ ఆదేశాలను తాళ్లూరు తహశీల్దారు లెక్క చేయడం లేదన్నారు. చింతలపాలెం లో దళితుల భూమి విషయంలో పెత్తందార్లు దాడి చేసిన ఘటన క్రైమ్ నెంబర్ 155/ 2021 కేసులో రిలీఫ్ కోసం రిపోర్ట్ పంపాలని కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశించి ఏడు నెలలైనా తాళ్లూరు తహశీల్దార్ పట్టించుకోవడం లేదన్నారు. బాధితులు అడిగితే రెండు రోజుల్లో రిపోర్ట్ పంపిస్తానంటూ ఏడు నెలలుగా పంపలేదన్నారు మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దారా అంజయ్య మాట్లాడుతూ దర్శి మండలం భోట్లపాలెంలో కులాంతర వివాహ నేపథ్యంలో పెత్తందార్ల చేతిలో హత్యయత్నానికి గురైన జక్కుల అనురాధ కూతురు మౌనికకు తాళ్లూరు మండలం తూర్పు గంగవరంలో ఇంటి స్థలం ఇవ్వాలని కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశించి ఒకటిన్నర నెల అయినా తాళ్లూరు తహశీల్దారు పట్టించుకో వట్లేదన్నారు. అనంతరం స్పందన కార్యక్రమంలో కలెక్టర్ దినేష్ కుమార్‌ను కలసిన నీలం నాగేంద్రరావు మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి బాధితుల పట్ల తాళ్లూరు తహశీల్దారు ప్రసాద్ అలసత్వం, అవినీతి వైఖరి, ధిక్కార స్వరం తో వ్యవహరిస్తున్నారని, వెంటనే సస్పెండ్ కోరారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ సెక్షన్ 3(2)(8) ప్రకారం పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేయించి తాళ్లూరు తహసీల్దార్ కెవి ప్రసాద్‌ను అరెస్ట్ చేయించాలని డిమాండ్ చేశారు. స్పందించిన కలెక్టర్ వెంటనే తాళ్లూరు తహశీల్దార్‌కు కు ఫోన్ చేయగా, డిప్యూటీ తహశీల్దార్ ఇమ్మానియేలు ఫోన్ ఎత్తి తహశీల్దారు వేరే పనిలో ఉన్నారని చెప్పారు. కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ వెంటనే తహశీల్దారును తనతో ఫోన్‌లో మాట్లాడించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో యానాది సేవా సంఘ నాయుకులు మేకల ఆదినారాయణ, మాల మహానాడు నాయుకులు కాకుమాను రవి, గోగులముడి రంజిత్, తానికొండ ఆనంద్, బాధితులు తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఆదర్శం చేగువేరా

ప్రజాశక్తి, దర్శి



నివాళులర్పిస్తున్న నాయకులు

చేగువేరా యువతకు ఆదర్శమని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు డివి. పిచ్చయ్య తెలిపారు. స్థానిక ప్రజా సంఘ కార్యాల యంలో చేగువేరా వర్ధంతి సోమవారం నిర్వహించారు. తొలుత చేగువేరా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సామ్రాజ్య దోపిడీకి వ్యతిరేకంగా ఆఖరిక్షణం వరకూ పోరాడిన ధీరుడిగా చేగువేరాను కొనియాడారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ మండల అధ్యక్షుడు జెసిపాల్, నాయకులు వెంకటరావు, ఆదినారాయణ పాల్గొన్నారు.

'సురక్ష'ను సద్వినియోగం చేసుకోవాలి : కమిషనర్

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం. వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక పాపాకాలనీలోని అర్బన్ హెల్త్ సెంటర్ సారథ్యంలో సెయింట్ థెరిస్సా స్కూల్ ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రతి కుటుంబంలో ప్రజలకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉన్నా పరిష్కరించుకునేందుకు అవకాశం ఉందని తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ హెల్త్ ఆఫీసర్ మనోహర్‌రెడ్డి, పలువురు వైద్యులు, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు. **శింగరాయకొండ:** ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్న లక్ష్యంతోనే రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎస్. రాజ్యలక్ష్మి తెలిపారు. శింగరాయకొండ మండలం పాకల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని జిల్లా వైద్యాధికారి డాక్టర్ రాజ్యలక్ష్మి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వైద్య సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుంటారని తెలిపారు. అనంతరం ప్రత్యేకంగా డాక్టర్లను పిలిపించి వైద్య పరీక్షలు అందిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా మొత్తం 865 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ధర్మేంద్ర, డాక్టర్ వంశీధర్, ఎంపిడిఒ షేక్ జమిఉల్లా, ఎంపిటిసిలు గొల్లమూడి అశోక్ కుమార్ రెడ్డి, వై.శ్రీను, అంకయ్య, ఉప సర్పంచి బల్లెల ప్రభాకర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఎస్‌కె. సుభాని, గ్రామ నాయకులు వాయల తాతయ్య దామతోటి శ్రీనివాసరావు గొల్లపూడి గోవర్ధన్ పాల్గొన్నారు. **కొత్తపట్నం :** జగనన్న ఆరోగ్య సురక్ష పథకం పేదలకు వరమని ఎంపిడిఒ సుజాత తెలిపారు. మండల పరిధిలోని ఆలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్యశిబిరాన్ని ఆలూరు సర్పంచి మాధవి, గాదెపాలెం సర్పంచి కోటిరెడ్డి, ఎంపిడిఒ సుజాత, కొత్తపట్నం పిహెచ్‌సి వైద్యురాలు డాక్టర్ వైష్ణవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ సుజాత మాట్లాడుతూ ఎఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు గ్రామాల్లో జల్లెడ పట్టి సర్వే నిర్వహించి కేస్ షీట్ తయారు చేసినట్లు తెలిపారు. వైద్యశిబిరంలో 500 మంది వైద్యపరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ వైష్ణవి, డాక్టర్ హేమంత్ కుమార్, ఈతముక్కల పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ వెంకటేష్, ఒంగోలుకు చెందిన పలువురు వైద్యులు, ఇఒఆర్‌డి బాల చెన్నయ్య, డిప్యూటీ తహశీల్దారు అర్జున్ రెడ్డి, ఎన్‌జిఒ సంఘం నాయకుడు శరత్, ప్రైవేట్ జనరల్ హాస్పిటల్ వైద్యుడు డాక్టర్ వరప్రసాద్, అంగన్‌వాడీ సూపర్ వైజర్ అనురాధ, సచివాలయ, పిహెచ్‌సి సిబ్బంది, ఎఎన్‌ఎంలు ఆశా వర్కర్లు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు. **కొండపి :** జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైసిపి రాష్ట్ర నాయకుడు డాకా పిచ్చిరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని కె.ఉప్పలపాడు జడ్‌పిహెచ్ స్కూల్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాకా పిచ్చిరెడ్డి మాట్లాడుతూ జగనన్న ఆర్యోగ సురక్ష ద్వారా గ్రామస్థాయిలో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా 370 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రమణమూర్తి, పెట్లూరు పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ పి.అనూషా, డాక్టర్ ఐ.ప్రియాంక, డాక్టర్ కీర్తి, డాక్టర్ గీత, వైద్య సిబ్బంది ఎం.రవిబాబు, కె.లక్ష్మినారాయణ, సిహెచ్.అన్నపూర్ణమ్మ, వాలంటీర్లు, సచివాలయం సిబ్బంది, ఎఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు. **నాగులుప్పలపాడు :** మండల పరిధిలోని కొత్తకోట గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్యశిబిరాన్ని ఎపి ఆరోగ్యశ్రీ ప్రత్యేక అధికారి డాక్టర్ యాదాల అశోక్‌బాబు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా డాక్టర్ అశోక్‌బాబు మాట్లాడుతూ డబ్బులు లేని కారణంగా వైద్యం చేయించుకునే విషయంలో ఎవరూ ఇబ్బంది పడకూడదనే ఉద్ధేశ్యంతో సిఎం జగన్మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి సుజాత సురేష్, ఎంపిడిఒ జయమణి, తహశీల్దారు సుజన్‌కుమార్, డాక్టర్లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్జొన్నారు .ఎంపిపి నలమలపు అంజమ్మ జగనన్న ఆర్యోగ సురక్ష శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న సురక్ష పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పేదలకు మెరుగైన వైద్య సేవలు పొందేందుకు ఈ ప్రథకం ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి చిన్నం సుజాత, నలమలపు కష్ణారెడ్డి, ఎంపిడిఒ జయమణి, సురేష్ తహశీల్దారు సుజన్ కుమార్ , డాక్టర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



ఒంగోలులో మాట్లాడుతున్న నగర పాలక సంస్థ కమిషనర్ వెంకటేశ్వరరావు



ఆలూరులో వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచులు, వైద్యాధికారులు



శింగరాయకొండలో మాట్లాడుతున్న డిఎం అండ్‌హెచ్‌ఒ రాజ్యలక్ష్మి



వృద్ధులతో మాట్లాడుతున్న డాక్టర్ యాదాల అశోక్‌బాబు

వినూత్న రీతిలో టిడిపి నాయకుల నిరసన

ప్రజాశక్తి-కొండపి

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును జైలు నుంచి విడుదల చేసే వరకూ పోరాటం కొనసాగిస్తామని కొండిపి ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి తెలిపారు. చంద్రబాబునాయుడు అరెస్టును ఖండిస్తూ మండల పరిధిలోని అనకర్లపూడి వద్ద ముసి నదిలో జలయజ్ఞ నిరాహార దీక్ష సోమవారం నిర్వహించారు. అనంతరం కొండపిలోని టిడిపి కార్యాలయంలో నిరసన దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్వామి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కొండపి నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదన్నారు. హక్కుల కోసం పోరాటాలు చేస్తున్నారిపై అక్రమ కేసులు బనాయించడం, జైలుకు పంపుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు యలమందనాయుడు, రాష్ట్ర నాయకులు వసంతరావు, రావిపాటి సీతమ్మ, నియోజకవర్గ పరిశీలకులు స్వాములు తదితరులు పాల్గొన్నారు. **చీమకుర్తి:** మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అరెస్టును నిరసిస్తూ టిడిపి నాయకులు రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. ఈ దీక్షల్లో సంతనూతలపాడు వేములపాడు, చీమకుర్తి మండలం చీమలమర్రి గ్రామానికి చెందిన మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బిఎన్.విజయకుమార్ మాట్లాడుతూ రాజకీయ కక్షతోనే చంద్రబాబు నాయుడుపై అక్రమ కేసులు బనాయించి జైలులో పెట్టించినట్లు తెలిపారు. అనంతరం దీక్షా పరులకు నిమ్మరసం అందజేసి దీక్షలను విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా నాయకులు మన్నంప్రసాదు,కాట్రగడ్డ రమణయ్య, ఉన్నం సుబ్బారావు, మద్దినేని హరిబాబు, గొల్లపూడి సుబ్బారావు, జి.రాఘవరావు, యడ్లపల్లి రామబ్రహ్మం,మారెళ్ళ శ్రీనివాసరావు, అబ్బూరి వెంకటరావు, సూరంపల్లి హనుమంతరావు,బుజ్జి,కాటేపల్లి యలమంద, నాగరాజు, మద్దినేని శ్రీను, కమలాకర్ పాల్గొన్నారు.



ముసిలో జలయజ్ఞ దీక్ష నిర్వహిస్తున్న టిడిపి నాయకులు



చీమకుర్తిలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విజయ్‌కుమార్

వినూత్నంగా టిడిపి నిరసనలు

• చీరాలలో నల్లకండువాలతో ఉరివేసుకుని నిరసన • గుళ్లకమ్మలో అద్దంకి నేతల జలదీక్ష • రేపల్లెలో మోకాళ్లపై నిరసన • వేమూరులో దీక్షల్లో పాల్గొన్న ఆనందబాబు



ఉరితాళ్లతో చీరాల టిడిపి దీక్షా శిభిరంలో నిరసన

ప్రజాశక్తి - చీరాల

వైసిపి కక్షపూరిత విధానాలు, చంద్రబాబు అక్రమ అరెస్టును వ్యతిరేకిస్తూ టిడిపి నేతలు కండువాలతో ఉరేసుకుంటున్నట్లు విన్నూత్నంగా సోమవారం నిరసన తెలిపారు. టిడిపి కార్యలయం వద్ద టిడిపి ఇన్చార్జి ఎంఎం కొండయ్య ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారంకు 27వ రోజుకు చేరాయి. దీక్షలలో నరాల తిరుపతి రాయుడు, తోట సాంబశివరావు, పల్లగొర్ల బాలసుబ్రమణ్యం, కోటి మోహన్‌కృష్ణ, ఎం వెంకటేశ్వర్లు, గోనబోయిన ఏడుకొండలు, గవిని నాగరాజు, పలగర్ల శ్రావణ్, అంగిరేకుల వెంకటేశ్వర్లు, గవిని బ్రహ్మయ్య, కొమ్మనబోయిన రజిని, పలగర్ల మస్తాన్రావు, గవిని సోమయ్య, కీర్తి ప్రసాద్, బచ్చుల సోమయ్య, కీర్తి వెంకటేశ్వర్లు, చప్పిడి శ్రీనివాసరావు, మచ్చుని పోలయ్య, పులి సోమయ్య, బుర్ల సుబ్బయ్య, కర్నేటి రవి, కీర్తి సుబ్బారావు, కొండేపి వెంకటేశ్వర్లు, కోటి సాంబశివరావు, రావూరి శేషగిరిలు పాల్గొన్నారు. కార్యక్రమంలో నాశిక వీరభద్రయ్య, గజవల్లి శ్రీనివాసరావు, యర్రా శివనాగ మల్లేశ్వరి, ఉసురుపాటి సురేష్, తేలప్రోలు నాగేశ్వరరావు, మంచాల చినరామిరెడ్డి, మద్దినేని వెంకటేశ్వరరావు, కూరపాటి పూర్ణ, కొండ్రు రత్నబాబు, బుర్ర కవిత, బుద్ధి దుర్గా మల్లేశ్వరి, దేవన విజయలక్ష్మి, పడవల లలిత పెద్ద సంఖ్యలో నాయకులు పాల్గొని సంఘీభావం ప్రకటించారు.



గుళ్లకమ్మలో జలదీక్ష చేస్తున్న అద్దంకి టిడిపి నేతలు

అద్దంకి : చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా టిడిపి నాయకులు గుండ్లకమ్మలో సోమవారం జలదీక్ష నిర్వహించారు. అనంతరం రిలే నిరాహార దీక్ష 27వ రోజు బల్లికురవ మండలం వైదన గ్రామ జనసేన టీంతో కలిసి చేశారు. దీక్షలో పోగుల చంద్రశేఖర్, మేడ సీతారామయ్య, చిన్న మేడ ప్రసాద్, పి దిలీప్ సాయి, ఏలూరు శ్రీను, బొమ్మిశెట్టి పెద్దబ్బాయి, వెండి స్వామి, మొగల్ సుభాని, గంధం అశోక్, కుమార్, బొమ్మిశెట్టి వెంకటేష్,షేక్ చందు, రుసం కొండల, రామిశెట్టి కొండలరావు, పి చిరంజీవి, పోగుల శ్రీనివాసరావు, ఎం శివప్రసాద్, వెండి స్వామి, తిరుమల శెట్టి శ్రీనివాసరావు, బొమ్మనబోయిన ఎర్రకోటయ్య, యేసురత్నం, వెల్డింగ్ బుడే, పి అప్పారావు, బండారు వెంకటేశ్వర్లు, తిరుమలశెట్టి చిరంజీవి, మూగబోయిన వెంకటేశ్వర్లు కూర్చున్నారు. పోగుల చంద్రశేఖర్ మాట్లాడుతూ పార్టీలు, కులాలకు అతీతంగా చంద్రబాబు అరెస్టును ప్రతి ఒక్కరు ఖండించాలని కోరారు. పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు ఎందాకైనా పోరాడుతామని అన్నారు. కుట్ర పూరిత విధానాలను తెగింపుతో ఎండగడతామని అన్నారు. సమరానికి ముందుఉంటామని అన్నారు. షేక్ ఖాదర్ మస్తాన్ మాట్లాడుతూ రాబోయేది టిడిపి, జనసేన ప్రభుత్వమేనని అన్నారు.

బాపట్ల : చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా టిడిపి ఇన్చార్జి వేగేశన నరేంద్ర వర్మ ఆధ్వర్యంలో టిడిపి కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్షలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నరేంద్ర వర్మ మాట్లాడు తూ రానున్న ఎన్నికల్లో ఓటమి భయంతోనే చంద్రబాబుపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని అన్నారు. కార్యక్రమం లో ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన నాయకులు నామన వెంకట శివన్నారాయణ, టిడిపి నాయకులు సలగల రాజ శేఖరబాబు, తాతా జయప్రకాష్ నారాయణ పాల్గొన్నారు.



పర్చూరు నిరసన దీక్షలో టిడిపి నేతలు

పర్చూరు : స్థానిక టిడిపి కార్యాలయంలో చంద్రబాబు అరెస్టుకు నిరసనగా సోమవారం దీక్షలు నిర్వహించారు. దీక్షల్లో టిడిపి నాయకులు వీరన్నపాలెం ఎంపిటిసి పుల్లెల పద్మ, ఉప్పుటూరి ఎంపిటిసి హుస్సేన్, మార్టూరు మహిళాధ్యక్షురాలు ఉప్పుటూరి రమాదేవి, కామేపల్లి స్వరూపరాణి, మానుకొండ సుబ్బమ్మ, గోరంట్ల సుజాత, నాగేశ్వరమ్మ పాల్గొన్నారు.


రేపల్లె : ఎలాంటి అక్రమాలు జరగకుండానే చంద్రబాబుపై అక్రమ కేసులు పెట్టారని తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు యలవర్తి లక్ష్మీ అన్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ టిడిపి చేపట్టిన రిలే దీక్షలు సోమవారంతో 26వ రోజుకు చేరాయి. కూల్చి వేతలతో జగన్‌రెడ్డి పాలన ప్రారంభించాడని, అభివృద్ధిని చెయ్యలేక ప్రతిపక్ష పార్టీల నాయకులపై అక్రమ కేసులు పెట్టిస్తూన్నాడని మండిపడ్డారు. ఓటమి భయంతో చంద్రబాబును అరెస్టు చేయించాడని పైశాచిక ఆనందం పొందుతున్నాడని అన్నారు. ప్రతిపక్ష పార్టీలకు ప్రజల్లో



రేపల్లె దీక్షా శిభిరంలో టిడిపి నేతల నిరసన

వస్తున్న ఆదరణను తట్టుకోలేక చంద్రబాబు ఏ నేరం చెయ్యక పోయినా జగన్మోహన్‌రెడ్డి జైలుకు పంపారని ఆరోపించారు. దీక్షలో తిరుపతమ్మ, యామిని నరసింహ, పంతాని సాయి, రేపల్లె సురేష్, చిరంజీవి, సజ్జ సాయి ప్రసాద్, నాయకులు అనగాని శివ ప్రసాద్, వై ధర్మతేజ, వెనిగళ్ళ సుబ్రమణ్యం, టి మల్లిఖార్జునరావు పాల్గొన్నారు.

కారంచేడు : ప్రతిపక్ష నాయకులపై కక్ష సాధింపు ధోరణి మానుకోవాలని ఎఎంసి మాజీ ఛైర్మన్ యార్లగడ్డ అక్కయ్య చౌదరి అన్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టును వ్యతిరేకిస్తూ స్థానిక టిడిపి కార్యాలయంలో జరుగుతున్న నిరసన కార్యక్రమాలు సోమవారంతో 31వ రోజుకు చేరాయి. ఆధారాలు లేని కేసులో అరెస్టు చేశారని అన్నారు. కార్యక్రమంలో టిడిపి గ్రామ అధ్యక్షుడు కంభంపాటి నరేంద్ర, మహిళా నాయకులు పాతూరి ఆదిలక్ష్మి, పోతిని వెంకటేశ్వర్లు, హనుమంతురావు, బొయిన శ్రీను, ఆకుల లక్ష్మి, సరసు సుధారాణి, జాన్సి, దగ్గుపాటి లక్ష్మి, నాగమణి, వెంకటరత్నం, సునీతా, మల్లీశ్వరి, పునాటి లక్ష్మణ నారయణ, బొడవుల రామచంద్రరావు, శివ, జాలయ్య, పాతూరి శివరాం, అనిల్ కుమార్, సాయి పాల్గొన్నారు.



వేమూరు నిరసన దీక్షల్లో మాజీ మంత్రి నక్కా ఆనందబాబు

భట్టిప్రోలు (వేమూరు) : మండలంలోని చదలవాడ గ్రామంలో చంద్రబాబు అరెస్టుకు నిరసనగా సోమవారం రిలే నిరాహార దీక్షలు చేశారు. దీక్షల్లో మాజీ మంత్రి నక్కా ఆనందబాబు మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అవినీతి పాలన సాగిస్తూ ప్రతిపక్షాలపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఎన్ని అక్రమ కేసులు బనాయించినా రానున్న ఎన్నికల్లో టిడిపి గెలుపు ఖాయమని అన్నారు. చంద్రబాబుపై ఎన్ని ఆటంకాలు సృష్టించిన కడిగిన ముత్యాల బయటికి వస్తారని ఆశాబావ వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు జొన్నలగడ్డ విజయబాబు, కనగాల మధుసూదనప్రసాద్, తూనుగుంట్ల సాయిబాబా పాల్గొన్నారు.



కొలతలపై వర్క్‌షాపులో సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులు

సివిల్ విద్యార్థులకు వర్క్ షాపు

ప్రజాశక్తి - వేటపాలెం

స్థానిక సెయింట్ ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో సివిల్ డిపార్ట్మెంట్ మూడవ సంవత్సరం విద్యార్థులకు సర్వేయిం గ్‌పై ఏడు రోజుల వర్క్ షాపును ప్రారంభిం చినట్లు కళాశాల మేనేజర్ ఆర్‌వి రమణమూర్తి సోమవారం తెలిపారు. విజయవాడ యునిక్ సర్వే సొల్యూషన్స్ ఆధ్వర్యములో ఈ వర్క్ షాపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సివిల్ ఇంజినీరింగ్ హెచ్‌ఒడి సిహెచ్ పవన్ కుమార్ మాట్లాడుతూ ఆధునిక సమాజ అవసరాలకు తగ్గట్లుగా విద్యార్థులు తమ నైపుణ్యాలను పెంపొందిం చుకోవాలని అన్నారు. తద్వారా ఉన్నత ఉద్యోగ అవకాశాలు పొందాలని ఆకాంక్షించారు. యునిక్ సర్వే సొల్యూషన్స్ ప్రతినిధి టి ప్రైమ్ బాబు మాట్లాడుతూ సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులు సర్వేయింగ్‌ను అవగాహన చేసుకొని టోటల్ స్టేషన్ ద్వారా సర్వే చేసి రివిట్ సాఫ్ట్వేర్ ద్వారా ఆచరణలో పెట్టినట్లైతే అద్భుతమైన ఫలితాలు రాబట్టవచ్చని తెలిపారు. ప్రిన్సిపల్ ఎం వేణుగోపాలరావు పాల్గొన్నారు.



పేద మహిళలకు చీరలు పంపిణీ చేసిన రోటరీ ప్రతినిధులు

పేదలకు చీరలు పంపిణీ

ప్రజాశక్తి - అద్దంకి

పట్టణములోని శ్రీ వెంకటేశ్వర ఆర్య వైశ్య కల్యాణ మండపం, గీతా మందిరంలో రోటరి పూర్వ అధ్యక్షులు గోరంట్ల లక్ష్మీనారాయణ అమ్మమ్మ వడ్లమూడి చిన ఆదెమ్మ జ్ఞాపకార్థం 36మంది పేద మహిళలకు చీరలు సోమవారం పంపిణీ చేశారు. అనంతరం గోరంట్ల లక్ష్మీనారాయణను ఘనంగా సన్మానించారు. సభ్యులు మాట్లాడుతూ లక్ష్మీనారా యణ గొప్ప దాతని అభినందనలు తెలిపారు. కార్యక్రమం లో రోటరీ అధ్యక్షులు చిన్ని మురళీకృష్ణ, సెక్రటరీ చప్పిడి వీరయ్య, కొల్లా భువనేశ్వరి, డాక్టర్ ఉబ్బా దేవపాలన, విద్వాన్ జ్యోతి చంద్రమౌళి, సందిరెడ్డి శ్రీనివాసరావు, జాగర్లమూడి శివకుమారి, నర్రా శ్రీలక్ష్మి, తమ్మన శ్రీనివాస రావు, మలాది శ్రీనివాసరావు, పసుపులేటి ఆంజనేయులు, అంజాద్ భాషా, చందలూరి కృష్ణ పాల్గొన్నారు.



కషాయం తయారీ వివరిస్తున్న ఎల్2 ఎ కోటిబాబు

ప్రకృతి వ్యవసాయంతో లాభాలు

ప్రజాశక్తి - యద్దనపూడి

మండలంలోని జాగర్లమూడిలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు సోమవారం జాగర్లమూడి యూనిట్ ఇంచార్జ్ ఎల్ 2 ఎ కోటి బాబు అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా రసాయన పురుగు మందులకు పెట్టే ఖర్చు తగ్గించుకోవచ్చని తెలిపారు. ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులను అందిపుచ్చుకోవచ్చని తెలిపారు. డేగర్ల శ్రీనివాసరావు పెరటి తోటకి ద్రవ జీవామృతం తయారు చేశారు. ఈ ద్రవజీవ అమృతం వలన భూమిలోని మొక్కలకి కావలసిన సూక్ష్మజీవులు అభివృద్ధి చెందాయని తెలిపారు. మొక్క ఎదుగుదలకి బాగా తోడ్పడుతుందని తెలిపారు.

చంద్రబాబును విమర్శించడం తగదు

టిడిపి ఇన్‌ఛార్జి వేగేశన నరేంద్రవర్మ

ప్రజాశక్తి - బాపట్ల

టిడిపిలో ఉన్నత పదవులు అనుభవించి తిరిగి వైసిపి పంచన చేరి స్కిల్ స్కాం సొమ్ము బాపట్లకి చేరిందని ఆ నాయకుడు ఆరోపించడం ఆయన పెద్దరికానికి తగదని టిడిపి ఇన్‌ఛార్జి వేగేశన నరేంద్రవర్మ అన్నారు. టిడిపి కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానికంగా ఆదివారం జరిగిన ఒక కార్యక్రమంలో స్కిల్ డెవలప్ మెంట్ స్కాంకు సంబంధించి చంద్రబాబుపై ఆరోపణలు చేయటాన్ని వర్మ ఖండించారు. స్కిల్ స్కాంకు సంబంధించి ఆధారాలన్ని ఆ నాయకుడి దగ్గర ఉంటే సిబిసిఐడి ద్వారా నిరూపించొచ్చు కదా అని ప్రశ్నించారు. స్కిల్ స్కాం డబ్బులు బాపట్లకు వచ్చాయనే ఆధారాలు ఆరోపించిన నాయకుడి దగ్గర ఏమైనా వున్నాయా అని ప్రశ్నించారు. నోరు వుంది కదా అని చంద్రబాబుపై ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదన్నారు. ఇసుక మాఫియాతో రూ.వందల కోట్లు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వేగేశన నరేంధ్రవర్మ

సంపాదించిందెవరో ప్రజలందరికీ తెలుసని అన్నారు. రహదారుల విస్తరణలో భాగంగా భవన యజమానులకు బాండులు సకాలంలో ఇవ్వకుండా వ్యాపారస్తులను ఇబ్బందులు పెట్టారని అన్నారు. స్థలం కోల్పోయిన భవన యజమానులు ప్రశ్నిస్తే వారి స్థలంలో రోడ్డును వంకర్లు తిప్పేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. డ్రైనేజిని అస్తవ్యస్థం చేశారని అన్నారు. వైద్య కళాశాల శంకుస్థాపన చేసిన రోజు 2024కల్లా కళాశాలను పూర్తి విద్యార్థులకు అడ్మిషన్లు ప్రారంభిస్తామని చెప్పిన మాటలు ఏమయ్యాయని అన్నారు. మెడికల్ కాలేజ్ పనులు ఇప్పటి వరకు ఎందుకు పూర్తి చేయలేదో సమాధానం చెప్పాలని అన్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా రిలే నిరాహార దీక్షలకు, ర్యాలీకి టిడిపికి అనుమతుల్లేవని అంటున్న పోలీసులకు ఆదివారం వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులో నిర్వహించిన సమావేశానికి 30పోలీస్ యాక్ట్ ఎందుకు వర్తించలేదని ప్రశ్నించారు. గడచిన నాలుగున్నరేళ్లలో అధికారపక్షం నాయకులు ఏమేమి తప్పులు చేసారో తన దగ్గర పూర్తి అధారాలు వున్నాయని అన్నారు. దీనిపై బహిరంగ చర్చకు సిద్ధమేనా అని అన్నారు. సమావేశంలో టిడిపి నాయకులు సలగల రాజశేఖర బాబు, గొలపల శ్రీనివాసరావు, ఏపూరి భూపతిరావు, ఆంధ్రేయ, భవనం బసివిరెడ్డి, దయాబాబు, బొద్దుకూరి విజయ, గోపాపురం సంధ్య, మోదుగుల శంకరరెడ్డి, అఫ్జల్ పాల్గొన్నారు.

బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిబంధనలను

అధికారులు సక్రమంగా అమలుచేయాలి

కలెక్టర్ రంజిత్‌బాషా


మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

బయోమెడికల్ వేస్ట్ మేనేజ్మెంట్ నిబంధనలను అధికారులు సక్రమంగా అమలుచేయాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదేశించారు. బయోమెడికల్ వేస్ట్ మేనేజ్మెంట్ నిబంధనలపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జరిగింది. ప్రజల జీవితాలను కాపాడేందుకు పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని కలెక్టర్ చెప్పారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఆసుపత్రులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో 264 ఆసుపత్రులు నడుస్తున్నాయన్నారు. ముఖ్యంగా బయో మెడికల్ వ్యర్థాలను సాంకేతిక పద్ధతిలో తొలగించాలని స్పష్టం చేశారు. ప్రస్తుతం 40 ఆసుపత్రులకు అనుమతి లేకపోవడంపై ఆరా తీశారు. ఆసుపత్రుల నిర్వహణ సరిగా లేకపోతే తక్షణమే నోటీసు ఇవ్వాలని, తదుపరి చర్యలు తీసుకోవాలన్నారు. 50 పడకల ఆసుపత్రులు జిల్లాలో 10 ఉండగా వాటి నుంచి అధిక స్థాయిలో వ్యర్థాలు వచ్చే అవకాశం ఉందన్నారు. అనుమతులు లేని ఆసుపత్రులను పరిశీలించడానికి సబ్ కమిటీలు నియమించాలని కలెక్టర్ ఆదేశించారు. పర్యావరణాన్ని పరిరక్షించడానికి కాలుష్య నియంత్రణపై అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణాలలోని ఆసుపత్రుల నిర్వహణపై ప్రత్యేక దష్టి సారించాల్సిన అవసరం ఉందని వివరించారు. ఆసుపత్రుల నుంచి వ్యర్థాల తొలగింపుపై అధికారులు సాంకేతికపరమైన యాజమాన్య పద్ధతులను అలంబించాలన్నారు. ఆస్పత్రులలో చెత్త తొలగింపు పన్నులు వేయాలన్నారు. బయో మెడికల్ అవసరతను గుర్తించాలన్నారు. సిబిఎండబ్ల్యుటి పర్యావరణ పరిరక్షణ ఏజెన్సీలకు సహకరించాలని ఆయన సూచించారు. సమావేశంలో కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజనీర్ జి.రాఘవరెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎస్ విజయమ్మ పాల్గొన్నారు.

ఎపిటి ప్రక్రియ పూర్తిచేసేలా చర్యలు

బ్యాలెట్ యూనిట్లను పరిశీలించిన కలెక్టర్ దినేష్‌కుమార్


బ్యాలెట్ యూనిట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఎలక్ట్రానిక్ ఓటింగ్ పరికరాల యాక్సెప్టెన్స్ టెస్ట్ (ఏపిటి) ప్రక్రియను మంగళవారం నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ తెలిపారు. స్థానిక మామిడిపాలెంలోని ఈవిఎం గోదాములో నిర్వహిస్తున్న ఈ ప్రక్రియను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో సోమవారం ఆయన పరిశీలించారు. భెల్ కంపెనీ నుంచి వచ్చిన ముగ్గురు సాంకేతిక నిపుణుల పర్యవేక్షణలో 80 మంది సచివాలయ సిబ్బంది, 40 మంది వి.ఆర్‌ఒల సహకారంతో ఏపిటి నిర్వహిస్తున్నట్లు అధికారులు ఈ సందర్భంగా ఆయనకు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వివి ప్యాట్ల పరిశీలన ఇప్పటికే పూర్తి చేశామని, కంట్రోల్ యూనిట్ల పరిశీలన పూర్తి అయిందన్నారు. బ్యాలెట్ యూనిట్లకు ఏపిటి ప్రక్రియ మంగళవారంతో పూర్తి అవుతుందన్నారు. జిల్లాకు వచ్చిన వాటిలో రెండు బ్యాలెట్ యూనిట్లు, నాలుగు కంట్రోల్ యూనిట్లకు సంబంధించి తయారీ లోపం ఉన్నట్లు నిపుణులు గుర్తించారని, వీటిని తిరిగి కంపెనీకి పంపిస్తామనానరు. ఏ.పి.టి. పూర్తి చేశాక ఈ నెల 16వ తేదీ నుంచి ఫస్ట్ లెవల్ చెకింగ్ (ఎఫ్ఎల్‌సి) చేపడతామన్నారు. కలెక్టర్ వెంట డిఆర్‌ఒ ఆర్.శ్రీలత, ఒంగోలు ఆర్డీవో విశ్వేశ్వరరావు, కలెక్టరేట్‌లోని ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, బిజెపి జిల్లా కార్యదర్శి రాజశేఖర్, ఐటి విభాగాల ప్రతినిధి గుర్రం సత్యం, టిడిపి నుంచి కాలేషా బేగ్ ఉన్నారు.

అర్జీలు పునరావృతం కానీయొద్దు

ఎస్పీ వకుల్‌జిందాల్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

స్పందన అర్జీలు మళ్లీ మళ్లీ పునరావృతం కాకుండా సంతప్తికర స్థాయిలో పరిష్కరించాలని ఎస్పీ వకుల్‌జిందాల్ పోలీస్ అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ స్పందన కార్యక్రమం నిర్వహించారు. స్పందన కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు వారి సమస్యలను స్వయంగా జిల్లా ఎస్పీకి విన్నవించుకున్నారు. ఫిర్యాదుదారులు సమస్యలను కూలంకషంగా విని, వారి అర్జీలను పరిశీలించి, నిర్దిష్ట గడువులోగా ఫిర్యాదుదారుల సమస్యలను పరిష్కరించాలని సంబంధిత పోలీస్ అధికారులను ఎస్పీ ఆదేశించారు. స్పందన కార్యక్రమంలో వచ్చే అర్జీలను నిర్ణీత గడువులోపు విచారించి చట్టపరిధిలో పరిష్కరించాలని, అర్జీలు మళ్లీ మళ్లీ పునరావృతం కాకుండా సంతప్తికర స్థాయిలో పరిష్కారం అయ్యేలా దష్టి సారించాలని ఆదేశించారు. వరకట్నం వేధింపులు, కుటుంబ సమస్యలు, భూవివాదాలు, ఉద్యోగం ఇప్పిస్తామని చేసిన మోసాల గురించి, ఆర్థికపరమైన లావాదేవీల సమస్యలు మరియు ఇతర సమస్యలతో మొత్తం 62 మంది అర్జీదారులు స్పందన కార్యక్రమంలో వారి సమస్యలను జిల్లా ఎస్పీకి విన్నవించుకున్నారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ పి.మహేష్, స్పందన సెల్ ఇన్స్పెక్టర్ వి.మాలకొండయ్య పాల్గొన్నారు.

ప్రాజెక్టులను పట్టించుకోని ప్రభుత్వం

- రూ.10 కోట్ల విలువచేసే మరమ్మతులనూ నిర్లక్ష్యం చేస్తారా.?
- గుండ్లకమ్మ ప్రాజెక్టు మరమ్మతులు వేగవంతం చేయాలి
- లేకపోతే ఉద్యమం తప్పదు
- ప్రభుత్వానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ హెచ్చరిక


కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్రంలో సాగునీటి, తాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలను, మరమ్మతులను రాష్ట్ర ప్రభుత్వం గాలికి వదిలేసిందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకష్ణ ధ్వజమెత్తారు. గుండ్లకమ్మ ఆయకట్టు రైతు సంఘం ఆధ్వర్యంలో ఏడాది క్రితం వరదలకు కొట్టుకుపోయిన గుండ్లకమ్మ ప్రాజెక్టు మూడో నెంబర్ గేటును నిర్మించాలని, మధ్యలో వదిలేసిన కాలువ పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 5న ప్రారంభమైన పాదయాత్ర 8వ తేదీ ముగిసింది. సోమవారం ఒంగోలులోని అద్దంకి బస్టాండ్ సెంటర్ నుండి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి.. అనంతరం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నాకు గుండ్లకమ్మ ఆయకట్టు రైతు సంఘం ప్రధాన కార్యదర్శి వడ్డె హనుమారెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రామకష్ణ మాట్లాడుతూ రూ.రెండు లక్షల కోట్ల బడ్జెట్‌తో ఉన్న రాష్ట్రంలో కేవలం గుండ్లకమ్మ ప్రాజెక్టు మూడో నెంబర్ పెట్టేందుకు రూ.10 కోట్లు కూడా కేటాయించలేని దద్దమ్మ ప్రభుత్వమన్నారు. ఆరు సార్లు గేటు నిర్మాణానికి టెండర్లు పిలిచినా ఒక్కరూ ముందుకు రాకపోవడం ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమన్నారు. రూ.670 కోట్లతో 14 సంవత్సరాల క్రితం నిర్మించిన గుండ్లకమ్మ ప్రాజెక్టు నిర్మాణం లక్ష్యాలకు దూరంగా ఉందన్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో 60 వేల ఎకరాలు, రబీలో 80 వేల ఎకరాలు పంట వేయలేదని, ప్రాజెక్ట్‌లోని నీరంతా సముద్రం పాలైందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రాజెక్టు మరమ్మతులకు నిధులు కేటాయించి, యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలన్నారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్త ఉద్యమానికి శ్రీకారం చుడతామని హెచ్చరించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ రైతన్న పోరాటాలకు సిపిఐ ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. ఏపీ రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవివి ప్రసాద్ మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా రైతాంగం అంతా గుండ్లకమ్మ ప్రాజెక్టు నిధులు సాధించాలని పిలుపునిచ్చారు. నిరసన సభకు సంఘీభావం ప్రకటించిన ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకటరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రాజెక్ట్‌ల నిర్మాణంపై చిత్తశుద్ధి లేదన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం గుండ్లకమ్మ ప్రాజెక్ట్‌లో కనిపిస్తోందన్నారు. గుండ్లకమ్మ 3వ గేటు కొట్టుకుపోతే తిరిగి ఏర్పాటు చేయలేని స్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి గుండ్లకమ్మ ప్రాజెక్టు మరమ్మతులు వెంటనే చేయాలని డిమాండ్ చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు మాట్లాడుతూ రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి తన శాఖకు సంబంధించిన విషయాలు తప్ప అన్నీ మాట్లాడతారని ఎద్దేవా చేశారు. కేవలం నెలరోజుల వ్యవధిలో ప్రాజెక్టు గేట్లు పెట్టిస్తామని హామీ ఇచ్చిన మంత్రి ఇప్పుడు ఏం చేస్తున్నారో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. ప్రాజెక్ట్ సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు పోరాడాలని కోరారు. కార్యక్రమంలో నల్లమల రైతు సంఘం రాష్ట్ర నాయకులు కొల్లా రాజమోహన్ రావు, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు డి,సుబ్బారెడ్డి, తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోలవరపు వెంకటరామయ్య, మద్దిపాడు ఏఎంసి మాజీ చైర్మన్ మండవ రంగారావు, ఒంగోలు ఏఎంసీ మాజీ చైర్మన్ కామేపల్లి శ్రీనివాసరావు, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష అమలు పరిశీలన

ప్రజాశక్తి-బాపట్ల

జగనన్న సురక్ష అమలు తీరును జిల్లాలో కేంద్ర బృందం సోమవారం పరిశీలించింది. ఈ నెల 9 నుండి 15 వరకు జిల్లావ్యాప్తంగా క్షేత్రస్థాయిలో ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్య సేవలను ఇద్దరు సభ్యులతో కూడిన కేంద్ర బందం పరిశీలిస్తారు. ఇందులో భాగంగా జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఆరోగ్య అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి విజయమ్మ, వైద్యాధికారులు పాల్గొన్నారు.


వైద్యాధికారులతో సమీక్షిస్తున్న కేంద్ర బృందం

'స్పందన' అర్జీలు ఖచ్చితంగా పరిష్కరించండి

- అధికారులకు కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం - డయల్ యువర్ కలెక్టర్‌కి విశేష స్పందన

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

స్పందన కార్యక్రమంలో వచ్చిన ప్రతి అర్జీని కచ్చితంగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఏఎస్.దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్లోని స్పందన యువర్ కలెక్టర్". 'స్పందన' కార్యక్రమాలలో ప్రజల నుంచి ఆయన ఫిర్యాదులు, విజ్ఞప్తులను స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ స్పందనలో వచ్చే అర్జీలపై ప్రత్యేక దష్టి పెట్టాలన్నారు. అర్జీల పరిష్కారంలో పారదర్శకత ముఖ్యమని, పిటిషన్లు రీఓపెన్ కాకుండా చూడాలన్నారు. ప్రజలు సంతప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. సమస్యను పరిష్కరించలేని పక్షంలో అందుకు గల కారణాలను అర్జీదారులకు క్లుప్తంగా వివరించాలన్నారు. స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

డయల్ యువర్ కలెక్టర్‌కి విశేష స్పందన

తొలుత డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమంలో కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ ప్రజలు ఫోన్‌లో ప్రస్తావించిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా, మండల స్థాయి అధికారులను ఆదేశించారు. వీటిపై అప్పటికప్పుడే సంబంధిత అధికారులతో కలెక్టర్ మాట్లాడారు.

- కొమరోలు మండలం రెడ్డి చెర్ల గ్రామం నుంచి పి. వెంకటరామిరెడ్డి ఫోన్ చేసి తమ భూమిని ఆన్‌లైన్ చేయడం లేదని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ స్పందిస్తూ ఈ సమస్యను పరిష్కరించాలని కొమరోలు మండల తహాశీల్దారు ఆదేశించారు.
- పొన్నలూరు మండలం బైరెడ్డిపాలెం గ్రామం నుంచి బ్రహ్మయ్య ఫోన్ చేసి జగనన్న కాలనీలో ఇంటి నిర్మాణం పూర్తి చేశానని, దానికి సంబంధించిన నగదు ఇంకా తమకు జమ కాలేదని కలెక్టర్ దష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యను పరిష్కరించాలని కలెక్టర్ హౌసింగ్ అధికారులను ఆదేశించారు.
- పొదిలి మండలం కాటూరివారిపాలెం గ్రామం మంచి వై.నరశింహారావు ఫోన్ చేసి తమ గ్రామంలో విద్యుత్ స్తంభం ధ్వంసమైందని, కొత్త స్తంభం ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను కోరారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు.
- పొదిలి మండలం నవమిట్ట నుంచి కెబహుదుల్లా ఫోన్ చేసి తమ పొలంలోని పైరును పాడు చేశారని, విచారణ జరిపి తనకు న్యాయం చేయవలసినదిగా కోరారు. ఈ విషయంపై సమగ్ర విచారణ చేసి సమస్యను పరిష్కరించాలని వ్యవసాయశాఖ అధికారుల ను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో జెసి కె.శ్రీనివాసులు, డిఆర్‌ఒ ఆర్. శ్రీలత, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఉమాదేవి, లోకేశ్వరరావు, వరకుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.